J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12







THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 43 సంచిక : 6 14.7.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



## పసలేని పలుకులతో...

# పలచనవుతున్న పవన్!

### అర్థం లేని ఆరోపణలతో.. అభాసుపాలవుతున్న జనసేనాని

**పవన్ కళ్యాణ్ సొంతంగా రాజకీయ ఆరంగేట్రం చేసి దశాబ్దం పూర్తి కావస్తోంది. అంతకముందు వాళ్ళ అన్న చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ పెట్టినప్పుడు కూడా ఆయన ప్రజాక్షేత్రంలోకి వచ్చి ప్రచారం చేశారు. ఆ ఐదేళ్లు కూడా కలుపుకుంటే మొత్తం పదిహేనేళ్ళ అనుభవం. సాధారణంగా ఎంతటి అజ్ఞానైనా రాజకీయాలలోకి వచ్చాక ఆరంభదశలో తప్పటడుగులు వేసినా అనుభవాలు నేర్పించే పాఠాలతో రాటుదేలిపోతారు. పరిపక్వత సాధిస్తారు. పరిస్థితులకు తగ్గట్లుగా వ్యవహరిస్తూ ప్రజల మనస్సులో స్థానం పొందడానికి ప్రయత్నిస్తారు. కానీ, పవన్ కళ్యాణ్‌లో అలాంటి లక్షణాలు అస్సలు కనిపించడంలేదన్నది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. జనం మధ్యలోకి వచ్చినప్పుడల్లా ఏదో ఒక వివాదాస్పద ప్రకటనచేసి పవన్ అబాసు పాలవుతున్నారన్నది వారి ఉద్దేశం.**

పవన్ తాజాగా రాష్ట్రంలోని వలంటీర్స్‌ని ఉమెన్ ట్రాఫికింగ్ సూత్రదారులంటూ చిత్రీకరించి ఆరోపణలు చేయడం రాష్ట్రంలో తీవ్ర ప్రకంపనలు రేపుతోంది. "ఏ ఇంటిలో ఎంతమంది ఆడవాళ్లు ఉంటారు, వారిలో ఒంటరివాళ్లు ఎంత మంది, వితంతువులు ఎందరు, అమ్మాయిలుంటే వాళ్లకి బాయ్‌ఫ్రెండ్స్ ఉన్నారా లాంటి డేటా మొత్తం సేకరించి, వారి డేటాని కొంతమంది అసాంఘిక శక్తులకు అందజేస్తున్నారు. ఆ విధంగా 30,000 మంది అమ్మాయిలు కిడ్నాపైతే 14,000 మంది తిరిగొస్తే మిగిలిన వాళ్ల జాడ తెలియడం లేదు, సాక్షాత్తూ కేంద్ర నిఘా వర్గాలే తనకు ఈ సమాచారం ఇచ్చాయి" అంటూ పవన్‌కళ్యాణ్ మైకు చేతబట్టుకుని లొడలొడా మాట్లాడేశారు. ఈ మాటలు ఇప్పుడు తీవ్ర వివాదాస్పదమవుతున్నాయి. ఇలాంటి నిందలు వేసేటపుడు ఖచ్చితమైన ఆధారాలు చేతబట్టుకుని మాట్లాడాలి. ఇది కొన్ని వేలమంది వలంటీర్ల మనోభావాలకు, తెలుగు కుటుంబాల పరువు ప్రతిష్టలకు సంబంధించిన సున్నితమైన అంశం.

సాధారణంగా తన వ్యాఖ్యలు మీడియా వక్రీకరించిందని, వైసీపీ నేతలు తప్పుడు భాష్యం చెప్పారని సర్దిచెప్పుకునే అవకాశం కూడా లేకుండా తాను చెప్పిన దానిని తానే సమర్ధించుకుంటూ మళ్ళీ మాట్లాడడంతో ఈ వివాదం ఇంకా ముదురుతోంది.

జనం కనిపిస్తే చాలు...రెచ్చిపోయి మాట్లాడడం జనసేనాని నైజం. రాష్ట్రంలో వేల సంఖ్యలో ఉన్న గ్రామ వలంటీర్లపై నోరు పారేసుకుని అనవసరపు వివాదానికి తెర లేపారు. గ్రామాల్లో, పట్టణాల్లో, క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న వలంటీర్ల వ్యవస్థలో ఉన్న లోపాలపై నిర్మాణాత్మక విమర్శలు చేయడం సబబే. కానీ ఆలా కాకుండా వలంటీర్ల గురించి అర్థరహిత, నిరాధార ఆరోపణలు చేయడం ద్వారా పవన్ తన ఇమేజీని తానే డ్యామేజీ చేసుకున్నట్లయ్యింది.

ప్రభుత్వం ఒంటరి మహిళలకు, వితంతువులకు, అవివాహితులకు, వృద్ధులకు సంక్షేమ పథకాలు అందించాలంటే సమగ్ర సమాచారం కావాలి. లేదంటే నిధులు దుర్వినియోగం అవుతాయి. అందుకే వలంటీర్లు గడపగడపకూ తిరిగి వివరాలు సేకరిస్తున్నారు. ప్రభుత్వం వాటి ప్రకారం సంక్షేమ పథకాలు అందజేస్తోంది. ఏ ప్రభుత్వం అధికారపగ్గాలు చేపట్టినా ఈ ఆనవాయితీని కొనసాగించాల్సిందే. ఆమాత్రం అవగాహన కూడా లేకుండా పవన్ చేసిన విమర్శలు ఆయన రాజకీయ పరిపక్వతకు అడ్డం పడుతున్నాయి. పదేళ్లనుండి రాజకీయాలను అతి దగ్గరగా చూస్తున్న ఆయన నేర్చుకున్నది, తెలుసుకున్నది ఇదేనా అని జనసైన్యానికే అనుమానం వచ్చేలా ఆయన ప్రవర్తించడం విడ్డూరం.

### ఇంత అవగాహనా లోపమా..?

మహిళల ట్రాఫికింగ్ అన్నది ఆషామాషీ వ్యవహారం కాదు. దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఈ సమస్య ఉంది. రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థ లేకముందు, ఆ తర్వాత కూడా ఈ సమస్య కొనసాగుతోంది. వలంటీర్లతో సంబంధం లేని వ్యవహారం ఇది. దేశంలో అపహరణ లేదా ట్రాపింగ్‌కి గురవుతున్న

10 లో



# శ్రద్ధాంజలి

## శ్రీమతి తుంగా శ్రీదేవమ్మ గారు

(స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి గారి సతీమణి)

పరమపదించి జులై 20, 2023 నాటికి

నాలుగేళ్ళు గడవనున్న సందర్భంగా...

ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...

- కుటుంబసభ్యులు

జననం : 16.10.1930 నిర్యాణం : 20.07.2019

# ఆదాలను కలసిన.. ఆనం జయ



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఇటీవలే వైకాపాలో చేరిన ఆనం జయ కుమార్‌రెడ్డి ఈనెల 7న నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని గౌరవపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆదాల ఆనం జయకు శాలువా కప్పి... సాదరంగా స్వాగతం పలికారు. నెల్లూరు నగరంతో పాటు, రూరల్ నియోజకవర్గంలోనూ అనేకమంది ప్రజలతో ఆనం జయకు ఆత్మీయసంబంధాలున్నాయని, ఆయన తమ పార్టీలోకి రావడం సంతోషకరమన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో వైకాపా ఘనవిజయం తప్పదని, పార్టీ నాయకులందరం కలసికట్టుగా పనిచేసి, వైకాపా విజయానికి కృషిచేస్తామని చెప్పారు.

## డెంగ్యూ వ్యాధి పట్ల..
# విద్యార్థులకు అవగాహన

డెంగ్యూ వ్యాధిపై విద్యార్థులు అవగాహన కలిగించుకుని, ఆ వ్యాధి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ సూచించారు. ఇటీవల ఆమె నెల్లూరులోని మోడల్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో డెంగ్యూవ్యాధి లక్షణాలను వివరించారు. తీవ్ర జ్వరం, ఎముకలు, కండరాలు భరించలేని నొప్పి, శరీరంపై పొక్కులు రావడం వంటివి డెంగ్యూ లక్షణాలని, ప్రాథమిక దశలోనే ఈ లక్షణాలను గుర్తించి, చికిత్సలు తీసుకుంటే ఈ వ్యాధి నుంచి బయటపడవచ్చని చెప్పారు. ఏఎంఓ నాగార్జునరావు, వెంకటేశ్వర్లు, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి స్వాగతం పలికిన.. జిల్లా ఎస్పీ



నెల్లూరులోని జిల్లా కోర్టు ఆవరణలో కొత్త కోర్టు భవనాల సముదాయాన్ని ప్రారంభించడానికి ఈనెల 9న నెల్లూరుకు విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయిని గౌరవపూర్వకంగా స్వాగతించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న జిల్లా ఎస్పీ డా. తిరుమలేశ్వర్‌రెడ్డి.

# గ్రంథాలయాలకు.. 'వేణు'నాదం పుస్తకాలు



నెల్లూరు విఆర్‌సి విశ్రాంత అధ్యాపకులు, ఆధ్యాత్మిక సాహితీవేత్త దివంగత మోపూరు వేణుగోపాలయ్య స్మారకంగా రూపొందించిన 'ప్రవచన సుధాకరుని వేణు నాదం' సాహితీ సంచిక ప్రతులు ఇక జిల్లాలోని అన్ని శాఖా గ్రంథాలయాల్లోనూ అందుబాటులోకి వస్తున్నాయి. అనేకమంది లబ్దప్రతిష్ఠులైన సాహితీవేత్తల రచనలతో, అత్యద్భుతంగా రూపుదిద్దుకుంది ఈ సంచిక. సాహిత్యాభిమానులకు, పాఠకులకు ఉచితంగానే అందజేస్తున్న ఈ 300 పేజీల అమూల్యమైన పుస్తకం జిల్లాలోని 61 ప్రభుత్వ శాఖా గ్రంథాలయాల్లో అందుబాటులో ఉండేందుకు ఆ పుస్తక ప్రతులను నెల్లూరు రేబాలవారివీధిలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయానికి ఈనెల 9న స్వర్గీయ మోపూరు వేణుగోపాలయ్య స్మారక కమిటీ సభ్యులు టి.రమణయ్య, డా.ఎం.సుబ్రహ్మణ్యం (విఆర్‌సి విశ్రాంత ప్రిన్సిపాల్), మద్దూరు శ్రీనివాసులు అందజేశారు. కేంద్ర గ్రంథాలయ సంస్థ డెప్యూటీ లైబ్రేరియన్ సిహెచ్ ప్రసాద్ వాటిని స్వీకరించి, త్వరలోనే ఈ ప్రతులను జిల్లాలోని అన్ని శాఖాగ్రంథాలయాలకు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రంథాలయ సంస్థ లైబ్రేరియన్ ఎం.విజయ తదితరులు పాల్గొన్నారు.

# యువత అభివృద్ధి కోసమే.. 'కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు'

## - ఛైర్మెన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి




సమాజంలో అభివృద్ధి దిశగా మార్పు కోసం, విద్యార్థులు పాలుపంచుకునే సంస్థగా కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు (బిసిడిఈ)ను ప్రభుత్వం ఏర్పాటుచేయడం జరిగిందని, ఇది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానసపుత్రిక అని రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మెన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఈనెల 11న ఆయన విజయవాడలో బోర్డు సమావేశంలో మాట్లాడుతూ, దీని ద్వారా పాలనలో ప్రజలను భాగస్వామ్యం చేయడానికి వీలుపడిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పాలనను ప్రజల ఇంటి ముంగిట వరకు తీసుకుని వెళ్ళటం జరిగిందని, ముఖ్యంగా గ్రామ సచివాలయ వ్యవస్థ మరియు వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి ఒక్క పౌరుడికి సేవలను ఇంటి ముందుకే తీసుకువచ్చిన ఘనత దేశంలో ఆంధ్ర ప్రదేశ్‌కు మాత్రమే దక్కుతుందని ఆయన తెలిపారు. ఇంకా, పథకాల అమలులో ఏమైనా అడ్డంకులు ఉన్నాయేమో తెలుసుకోవటానికి విద్యార్థులను ఉపయోగించుకోవడం ద్వారా సరైన సమాచారాన్ని నిష్పక్షపాతంగా రాబట్ట వచ్చునని ముఖ్యమంత్రి ఆలోచన చేసి దీనిని ఏర్పాటుచేశారన్నారు. దానికి తనను అధ్యక్షునిగా నియమించడం సంతోషకరమని, ముఖ్యమంత్రి అప్పగించిన ఈ బాధ్యతను సక్రమంగా నెరవేర్చే దిశగా కృషిచేస్తామని చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీలలో అనేక అవగాహన కార్యక్రమాలు, శిక్షణా తరగతులు నిర్వహించడం జరిగిందని తెలిపారు. రాబోయే విద్యా సంవత్సరంలో సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ మరియు బీసీ వెల్ఫేర్ స్కూళ్లలో ఉన్నత విద్యాసంస్థల విద్యార్థులు మెంటర్స్‌గా ఉండే కార్యక్రమాన్ని చేపట్టబోతున్నామని తెలిపారు. దీని ద్వారా మన యువతరాన్ని అభివృద్ధి దిశగా ఉరకలెత్తించవచ్చన్నారు. బిసిడిఈ సెక్రటరీ–సీఈవో ప్రొఫెసర్ దేవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 43 ఏళ్ళనాటి కరెంటుస్తంభాలు.. మార్చండి సారూ!

ఎప్పుడో 43 ఏళ్ళ కిందట వేసిన కరెంటు స్తంభాలు ఇప్పుడు దెబ్బతిని కూలిపోయే స్థితికి చేరుకున్నాయని, ఇకనైనా పట్టించుకుని కొత్తవి వేయాలని ఎన్నిసార్లు పంచాయతీ వారిని కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని సీతారామపురం మండలంలోని గుండుపల్లి దళితవాడ గ్రామస్తులు వాపోతున్నారు. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో భాగంగా వారు ఆ మేరకు అర్జీలు రాసి ఉపసర్పంచ్ చిట్టిబాబు ఆధ్వర్యంలో ఎంపీడీఓకి వినతిపత్రం సమర్పించారు.

# చిన్నారుల్లో ఆధ్యాత్మిక జ్ఞానజ్యోతులు వెలిగిస్తున్న.. జియ్యర్ ట్రస్ట్

## చెన్నైలో మూడు దశాబ్దాలుగా మన తెలుగువారి నిరుపమాన సేవలు

చెన్నైలో ఆధ్మాత్మిక విద్యకు బాటలు వేస్తూ, విద్యార్థులకు దారిదీపంలా వెలుగు తీనుతూ, చిన్నతనం నుంచే బాలలకు దైవభక్తిని, ధార్మిక విషయాలపై ఆసక్తిని కలుగజేస్తూ అందరి మన్ననలు అందుకుంటోంది జియ్యర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్. ప్రఖ్యాత ఆధ్యాత్మిక గురువు.. శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జియ్యర్‌స్వామి (చిన్న జియ్యర్‌స్వామి) మంగళాశీస్సులతో ఈ ట్రస్ట్‌ను సుమారు 30ఏళ్ల క్రితం చెన్నైలో స్థాపించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు, మేనేజింగ్ ట్రస్టీ కూడా జిన్నజియ్యర్ స్వామివారే. బాలల్లో ఆధ్యాత్మిక చింతనాసక్తిని పెంపొందింపజేసి, తద్వారా ఉత్తమ పౌరులుగా వారిని తీర్చిదిద్ది సమాజాభ్యున్నతికి బాటలు వేయాలన్నదే స్వామివారి సంకల్పం. ఆ లక్ష్యానికి అనుగుణంగా జియ్యర్‌స్వామి ఆదేశాలతో ట్రస్ట్ అధ్యక్షులు పి.రవీంద్రకుమార్‌రెడ్డి, కార్యదర్శి పి.విశ్వంభర్ తదితరుల సారథ్యంలో దాదాపు మూడు దశాబ్దాలుగా ఈ సంస్థ నిరుపమాన సేవలందిస్తోంది. ప్రతిఏటా ఈ సంస్థ చెన్నై నగరంలోని బాలలకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తోంది. సుమారు 28 సంవత్సరాలుగా ఆధ్మాత్మిక రంగానికి సంబంధించిన అనేక విషయాలపై పోటీలు, ప్రత్యేకించి భజనల పోటీలు నిర్వహించి బహుమతులిచ్చి ప్రోత్సహిస్తోంది. విష్ణు సహస్రనామం, ముకుందమాల, హయగ్రీవస్తోత్రం, యమునాచార్యులవారి ఆలవందార్ స్తోత్రరత్నం, అష్టకాలు, ఎంతో విశిష్టమైన 'నాలాయిర దివ్యప్రబంధం' వగైరాలతో పాటు, అనేకరకాల భక్తిగీతాలు, భజన పాటల్లో పోటీలు నిర్వహిస్తూ, విద్యార్థుల్లో ఆధ్మాత్మిక జిజ్ఞాసను కలుగజేస్తోంది జియ్యర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్.

### ట్రస్ట్ నిర్వహణలోనూ మన నెల్లూరీయులు :

తమిళనాట ఉన్న ఈ ఆధ్యాత్మిక ట్రస్ట్ నిర్వాహకుల్లో తెలుగువారు, మన నెల్లూరీయులు కూడా ఉండడం విశేషం. ట్రస్ట్ అధ్యక్షులు పి.రవీంద్రకుమార్‌రెడ్డి నెల్లూరు జిల్లా సర్వేపల్లి మండలంలోని ఇసుకపాళెం నివాసి. ఉపాధ్యక్షులుగా ఉన్న ఆధ్మాత్మిక సేవాతత్పరుడు పొన్నలూరు సనత్‌కుమార్ రెడ్డి నెల్లూరువారే. అదేవిధంగా నెల్లూరుకు చెందిన పత్తివారి ఆడపడుచు సౌజన్య ఈ కమిటీకి సభ్యురాలిగా సేవలందిస్తున్నారు. ట్రస్ట్ కార్యక్రమాలకు సహకరిస్తూ ప్రోత్సహిస్తున్న రాజ్యసభ సభ్యులు, ప్రముఖ దాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తమవంతు సహకారమందిస్తున్న మాగుంట కుటుంబం వారు అందరూ నెల్లూరీయులే. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అన్నివిధాలుగా చేయూతనందిస్తున్న శ్రీసిటీ ఎం.డి డాక్టర్ రవి సన్నారెడ్డి అందరికీ సుపరిచితులే.



### శ్రీసిటీ సన్నారెడ్డి దాతృత్వం మరువలేనిది

శ్రీసిటీ ఎం.డీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఔదార్యంతో ఈ పోటీలను దిగ్విజయంగా నిర్వహించామని, ఆయన దాతృత్వం మరువలేనిదని నిర్వాహకులు ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేశారు. ఇదేవిధంగా ఈనెల 15, 16 తేదీల్లో కూడా ఈ పోటీలు జరుగుతాయని, ఇప్పటికే దాదాపు 1400 మంది బాలబాలికలు ఆ పోటీలకు తమ పేర్లు నమోదు చేసుకున్నారని ట్రస్ట్ అధ్యక్షులు రవీంద్రకుమార్‌రెడ్డి చెప్పారు. జియ్యర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కోశాధికారి శాంతిరావు, సమన్వయకర్త పి.కమల, ట్రస్ట్ ప్రతినిధులు ఒమ్మిడి బాలాజీ, పివిఆర్ కృష్ణారావు, చలపతిరావు, న్యాయవాది రవి, రమేష్, మీరాశేఖర్, అన్నపూర్ణ, పద్మలత, గజలక్ష్మి, శారద, పద్మశ్రీ, సౌజన్య, ప్రేమధాత్రి తదితరుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు ఆద్యంతం అందరినీ అలరించాయి.

ఈ నేపథ్యంలో ఇటీవల చెన్నై–టీనగర్‌లోని వాణిమహల్‌లో నిర్వహించిన వార్షిక భజనల పోటీలు మరింత ఉత్సాహంగా, భక్తిరసస్ఫోరకంగా జరిగాయి. భజన గీతాలను విద్యార్థులు అత్యద్భుతంగా గానం చేసి అందరి కరతాళధ్వనులందుకున్నారు. ఈ పోటీల్లో చెన్నైలోని వివిధ పాఠశాలల నుంచి సుమారు 400 మంది చిన్నారులు పాల్గొన్నారంటే ట్రస్ట్ విద్యార్థులను ఎంతగా ఆకట్టుకుంటోందో అర్థం చేసుకోవచ్చు. ఈ నెల 9న జరిగిన బహుమతి ప్రదాన కార్యక్రమంలో శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పాల్గొని బాలలకు మరింత ఉత్సాహాన్నిస్తూ ప్రసంగించారు. చిన్నతనం నుంచే బాలల్లో ఆధ్యాత్మిక చింతన అలవడాలని, విద్యార్థి దశలో ఆధ్మాత్మికతను మరింత పెంపొందించుకోవాలని, తద్వారా సమాజంలో ఉత్తమ పౌరులుగా రాణిస్తూ దేశాభ్యున్నతికి పాటుపడాలని ఆయన ఆకాంక్షించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా జోస్యుల శైలేష్ వ్యవహరించారు. అనంతరం, పోటీల్లో విజేతలైన బాలబాలికలకు రవీంద్ర సన్నారెడ్డి చేతులమీదుగా ట్రోఫీలు, సర్టిఫికెట్లు బహూకరించారు.

# రంగనాథస్వామి గుడిలో గోల్మాల్!

- 250 గ్రాముల బంగారం..ఒకటిన్నర కిలో వెండి మాయం
- ముమ్మరంగా ఏసీబీ తనిఖీలు..తవ్వేకొద్దీ అక్రమాలు

***నెల్లూరులోని రంగనాయకులపేటలో ఉన్న ప్రసిద్ధమైన శ్రీదేవీ భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవాలయంలో అసలేం జరుగుతోంది?.. నిధుల దుర్వినియోగం జరిగిందా?.. బంగారం ఏమైనా మాయం చేశారా?.. అని ఏసీబీ అధికారులు గత మూడు రోజులుగా ఆరా తీస్తున్నారు.***



ఈ ఆలయంలో నిధుల దుర్వినియోగం జరిగిందంటూ వచ్చిన ఆరోపణల నిగ్గుతేల్చేందుకు ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు. ఈనెల 10, 11, 12 తేదీల్లో ఏసీబీ డిఎస్పీ మోహన్ ఆధ్వర్యంలో రికార్డుల పరిశీలన జరిగింది. ఆలయానికి సంబంధించిన ఆదాయ వ్యయాలు, ధూప దీప నైవేద్యాల ఖర్చులు, పారిశుద్ధ్యం ఖర్చులు, లీజులు వగైరాలకు సంబంధించి అన్ని కోణాల్లో ఏసీబీ అధికారులు పరిశీలనలు చేస్తున్నారు. స్వామివారి ఆభరణాలను కూడా పరిశీలించారు. 15 కేజీల బంగారు నగలకు సంబంధించి 250 గ్రాముల బంగారం తగ్గినట్లు, ఒకటిన్నర కిలో వెండి మాయం అయినట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. పూర్తి స్థాయి పరిశీలన కోసం ప్రతి విభాగంలోనూ తనిఖీలు చేస్తున్నారు. 2019 నుంచి ఇప్పటిదాకా ఆలయానికి భక్తులకు సమర్పించిన కానుకలు, వెండి-బంగారు ఆభరణాల లెక్కలన్నీ బయటకు తీస్తున్నారు. నిబంధనల ప్రకారం, స్వామివారికి భక్తులు ఇచ్చిన ఆభరణాలను అప్రయిజర్‌తో తనిఖీ చేయించి రికార్డుల్లో నమోదు చేయాల్సి ఉండగా, అలాంటిదేమీ ఆలయ అధికారులు పట్టించుకోలేదన్న విషయం కూడా అధికారుల దృష్టికి వచ్చినట్లు తెలుస్తోంది. అలా పట్టించుకోకపోవడం వెనుక మతలబు ఏమిటన్నది కూడా ఏసీబీ అధికారులు విచారిస్తున్నట్లు భోగట్టా. ఎవరెవరు ఎంతెంత విలువైన వస్తువులను, నగదును ఇచ్చారో వారి వివరాలు తెలుసుకుని, ఆలయానికి చెక్కుల రూపంలో నగదును బహూకరించిన వారిని నేరుగా ఫోన్లలో సంప్రదించి అధికారులు ఆ వివరాలన్నీ రాబడుతున్నట్లు కూడా తెలుస్తోంది. ఆలయానికి సంబంధించిన గోశాల నిర్వహణలో అవకతవకలు జరిగాయని, పారిశుద్ధ్యం పేరుతో అందినకాడకి తినేశారని, స్వామివారికి చెందిన ఫిక్స్‌డ్ డిపాజిట్ల వడ్డీల వాడకం కూడా ఇష్టం వచ్చినరీతిగా జరిగిందే తప్ప, దేనికీ లెక్కాపక్కా లేదని, కొందరు సిబ్బంది, ఆలయ అధికారులు ఈ అక్రమాలకు తెర తీశారని, ఆలయానికి ఏటా వచ్చే ఆదాయంలో మిగులును డిపాజిట్ చేయకుండా తెలివిగా మరుసటి సంవత్సరానికి వాడుతున్నారని కూడా ఆరోపణలున్నాయి. అంతేకాదు, స్వామివారి ఉత్సవాలకు కొనుగోలు చేసే పంచెలు, కండువాలు, శాలువాలు, చీరలను కూడా బిల్లుల రూపంలో అధికమొత్తంలో వాడుకున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. అన్ని ఆరోపణలను ఏసీబీ అధికారులు పరిగణనలోకి తీసుకుని గత 15 ఏళ్ళ క్రితం నాటి రికార్డులు కూడా తనిఖీ చేస్తున్నారు. ఆలయంలో అసలేం జరిగిందో, ఎవరి హయాంలో ఏం దుర్వినియోగం జరిగిందో, ఎంతెంత మింగేశారో..ఏ విభాగంలో ఎక్కడెక్కడ ఏం మాయ జరిగిందో లోతుగా విచారిస్తున్నారు. తనిఖీలు ఇంకా జరుగుతున్నాయి. ఆ వివరాలను మాత్రం ఏసీబీ అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు. ఆ లెక్కలన్నీ తేలాక వివరాలు వెల్లడి కావచ్చునని భావిస్తున్నారు.



భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షురాలుగా జులై 13వ తేదీ గురువారం నాడు విజయవాడలోని పార్టీ రాష్ట్ర కేంద్ర కార్యాలయంలో పదవీ బాధ్యతలు తీసుకున్న దగ్గుపాటి పురంధేశ్వరిని శాలువతో సత్కరించి అభినందిస్తున్న భారతీయ జనతాపార్టీ జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్.

## వైవీని కలసిన ఆర్ఎస్ఆర్



తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ వై.వి.సుబ్బారెడ్డిని నెల్లూరు గ్రామ దేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ రావు శ్రీనివాసరావు(ఆర్ఎస్ఆర్) ఈనెల13న తిరుమలలో కలిశారు. ఇరుకళల అమ్మవారి ఆలయ అభివృద్ధి కోసం శ్రీవాణి ట్రస్టు ద్వారా నిధులు మంజూరు చేయవలసిందిగా గతంలో వై.వి. సుబ్బారెడ్డిని కోరిన విషయం తెలిసిందే! అదే విషయం ప్రస్తావించిన ఆర్ఎస్ఆర్ ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించిన వై.వి.సుబ్బారెడ్డి, తదుపరి జరుగబోయే టిటిడి బోర్డు సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆర్ఎస్ఆర్ వెంట సుబ్బారెడ్డి సోదరుడు హనుమారెడ్డి కూడా ఉన్నారు.




## ఎం.వి.రాయుడుకి 'గిడుగు' అవార్డు

అమెరికాలోని ఉత్తర అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో ఇటీవల ఫిలడెల్ఫియాలో నిర్వహించిన 23వ తానా ద్వైవార్షిక వేడుకల్లో ప్రముఖ తెలుగు భాషాభిమాని, సాహితీవేత్త, 'మనసు' ఫౌండేషన్ అధినేత మన్నెం వెంకటరాయుడు (ఎంవి రాయుడు)కు 'గిడుగు రామమూర్తి' స్మారక తెలుగు భాషా పురస్కారాన్ని అందజేసి అభినందించారు. ఈ నెల 9న జరిగిన ఈ వేడుకలో అమెరికాలోని తెలుగు ప్రముఖులెందరో పాల్గొన్నారు.

## ఐసిడిఎస్ పీడీగా..హేనా సుజన

ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఇందుకూరుపేట సిడిపిఓగా ఉన్న హేనా సుజనను నియమిస్తూ జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఈనెల12న ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటివరకు కావలి సిడీపీఓగా ఉన్న కె.సౌజన్య ఇన్‌చార్జి పీడీగా విధులు నిర్వహిస్తున్నారు. ఇకనుంచి ఆమె కావలి సిడిపిఓగా కొనసాగనున్నారు.

కీ॥శే॥ ముప్పవరపు గోపాలకృష్ణయ్య చౌదరి
జననం : 10.10.1931 నిర్యాణం : 08.07.2023
విజయ డెయిరీ మాజీ ఛైర్మన్, డిఎల్‌డిఏ మాజీ ఛైర్మన్

ఉత్తరక్రియలు

పాడి రైతులకు ఆత్మబంధువు
రాజకీయాల్లో అజాతశత్రువు
గ్రామీణుల కష్టనష్టాలు తెలిసిన సహృదయుడు
సేవాభావం ఊపిరిగా జీవించిన మహనీయ నాయకుడు
అందరికీ ఆత్మీయుడు, పేదల అభిమానపాత్రుడు
మా స్ఫూర్తిప్రదాత, మా జీవన దాత
శ్రీ ముప్పవరపు గోపాలకృష్ణయ్య చౌదరి గారు
తేది. 08.07.2023 శనివారం పరమపదించారు.
వారి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని
భగవంతుని ప్రార్థిస్తూ...

- కుటుంబసభ్యులు

పెద్దకర్మ : తేది. 20.07.2023 గురువారం
ఉ॥10.00గం.లకు నెల్లూరు, పొగతోటలోని వారి స్వగృహము నందు జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

లాయర్
జులై 14, 2023

# ఉత్తరాది జలవిలయం ఏం సూచిస్తోంది?

ఉత్తర భారతదేశంలో కనీవినీ ఎరుగని వర్షభీభత్సం ప్రజల జీవనాన్ని అతలాకుతలం చేస్తోంది. దాదాపు యాభై ఏళ్ళుగా ఇలాంటి జలవిలయం చూడలేదు. భారీ వానలు, వరదలతో ఉత్తరాది రాష్ట్రాలైన హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, హర్యానా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్ముకశ్మీర్, రాజస్థాన్ రాష్ట్రాలు అతలాకుతలం అవుతున్నాయి. కుండపోత వానలతో ఆ రాష్ట్రాలన్నీ నీట మునుగుతున్నాయి. వాగులు, వంకలు, నదులు పొంగిపొర్లి అనేకప్రాంతాల్లో ఇళ్ళు, మిద్దెలు మేడలు కూలిపోతున్నాయి. వరదలు పోటెత్తి విలయం సృష్టిస్తున్నాయి. ఇప్పటికే హిమాచలప్రదేశ్‌లో 18 మంది, పంజాబ్-హర్యానాల్లో 9 మంది, రాజస్థాన్‌లో ఏడుగురు, ఉత్తరాఖండ్‌లో నలుగురు, ఉత్తరప్రదేశ్‌లో ముగ్గురు.. మొత్తం 41 మంది దుర్మరణం పాలైనట్లు సమాచారం. అయితే ఈ సంఖ్య మరింత భారీగానే ఉంటుందని, ఒక్క హిమాచల్‌లోనే కనీసం 70 మందికి పైగానే మరణించి ఉండవచ్చని అంచనా. ఇక ఈ విలయం వల్ల జరిగే ఆస్తి నష్టం వేలకోట్లల్లోనే ఉంటుంది. దేశ రాజధాని ఢిల్లీ సైతం ఈ వరద ముప్పుతో కకావికలమైంది. ఎక్కడ చూసినా వీధుల్లో మోకాలి లోతు నీటిప్రవాహాలే. గతంలో ఎప్పుడూ లేనంతంగా ప్రమాదకర స్థాయిలో 206.38 మీటర్ల ఎత్తులో యమునా నది ప్రవహిస్తుండడంతో నదీపరీవాహక ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ వానలు వరదల ధాటికి పెద్దపెద్ద వంతెనలు కూడా తెగిపోయాయి. కొండచరియలు విరిగిపడ్డాయి. రోడ్లు కోసుకుపోయాయి. జనావాసాలు కుప్పకూలిపోతున్నాయి. అమర్‌నాథ్ యాత్ర కూడా నిలిచిపోయింది. 2013లో హిమాలయాల ప్రాంతాల్లో వచ్చిన పెను సునామీని తలపిస్తూ ఇప్పుడు ఈ జలవిలయం ప్రజలను భయకంపితుల్ని చేస్తోంది.

హటాత్తుగా విరుచుకుపడుతున్న ఈ వానలు, వరదల భీభత్సానికంతటికీ సహజసిద్ధమైన వాతావరణ మార్పులతో పాటు, మనిషి చేతులారా చేసుకుంటున్న పర్యావరణ విధ్వంసమే కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. చెట్లు నరికివేయడం, అడవులను ఇష్టంవచ్చినట్లు ఆక్రమించుకోవడం, కొండకోనల్లోని వనాలను సైతం బతకనీయకపోవడం, మనిషి తన స్వార్థం కోసం ఇలా ప్రకృతినంతా ధ్వంసం చేస్తుండడంతో ఏర్పడుతున్న ఉత్పాతాలివి. కొండలు, గుట్టలు, నదులు, చివరికి సముద్రాలు కూడా మానవ స్వార్థానికి బలైపోతున్నాయి. దీంతో ఎల్నినో వంటి అసహజ వాతావరణ ప్రకృతి ఏర్పడి, చివరికి మానవాళి మనుగడకే ముప్పు వాటిల్లుతుందని శాస్త్రవేత్తలు చెప్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఒకవైపు భూ తాపం పెరుగుతుండడం, మరోవైపు వరదలు వస్తుండడం వాతావరణంలో వస్తున్న మార్పులు అనూహ్యంగా ఉంటున్నాయి. దేశంలో అటు వైపు ముంచెత్తే వానలు, ఇటువైపు మండిపోయే ఎండలు అన్నట్లుగా ఇటీవలికాలంలో విచిత్రమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పర్యావరణాన్ని ఎవరూ పట్టించుకోకపోవడంతో కర్బన ఉద్గారాలు పెరిగిపోయి ప్రపంచవ్యాప్తంగా ఎల్నినో ప్రభావంతో వాతావరణం క్షణమొక రీతిగా మారిపోతున్న దురవస్త ఇప్పుడు సర్వత్రా వ్యాపిస్తోంది. వస్తే భారీవానలు, లేకుంటే కరువు అన్నట్లుగా తయారవుతోంది పరిస్థితి. హిమాలయాల్లో ఇలాంటి భారీ ఉత్పాతాలు ఇంకా ఇంకా వచ్చేందుకు అవకాశం ఉంటుందని వాతవరణ శాస్త్రవేత్తలు పదేపదే హెచ్చరిస్తూనే ఉన్నారు కూడా. ఈ విపత్తులను మనం ఎప్పటికప్పుడు తెలుసుకునే రాడార్ల పరిజ్ఞానం ఉన్నా, ఆ విపత్తు పైనబడేటప్పటికి ఏమీ చేయలేని అసహాయ స్థితిలో ఉంటున్నాం. ఇకనైనా స్వార్థం వీడి, పర్యావరణాన్ని ప్రతిఒక్కరూ కాపాడుకోకపోతే ఆ తర్వాత విచారించి ప్రయోజనం ఉండదు. అందుకు ముందుగానే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టమైన చట్టాలతో, దేశాన్ని విపత్తుల నుంచి శాశ్వత ప్రాతి పదికన కాపాడుకోవాలనే సంకల్పంతో ముందుకు రావాలి. పర్యావరణ విధ్వంసకారులపై కఠినచర్యలకు సమాయత్తం కావాలి.

పచ్చదనాన్ని, పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు మాటలతో కాక, చిత్తశుద్ధితో యుద్ధప్రాతిపదికన కృషి జరగాలి. ముందుగా, జలవిలయంలో పడి అల్లాడుతున్న ఉత్తరాది రాష్ట్రాల ప్రజానీకానికి దేశప్రజలందరూ అండగా ఉండి తమవంతు సాయం అందించాలి. భవిష్యత్తులో ఇలాంటి పెనుముప్పులకు సాధ్యమైనంత వరకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇకనైనా ప్రకృతిని-పర్యావరణాన్ని, పచ్చదనాన్ని కాపాడుకోవాలి. అందుకు తగ్గ జాగ్రత్తలు తీసుకోవడం మనకే కాదు, భవిష్యత్ తరాలకు కూడా అవసరం. ఉత్తరాది జల విలయం ఇప్పుడు సూచిస్తున్నది..సరిగ్గా ఇదే!...

# తెలుగుజాతిని తగలబెట్టేలా నాటా వార్షిక సంచిక!




గత వారం మన లాయర్ పత్రికలో 'తెలుగు వైభవాన్ని, వైభోగాన్ని నాటా సంబరాలు ప్రతిబింబింపచేశాయి' అని శీర్షిక పెట్టి రాశారు. నేనుకూడా ఆ సభలలో పాల్గొన్నాను. మొదటిరోజు వేడుకకు రాలేకపోయినా మిగిలిన రెండు రోజులూ కార్యక్రమాలన్నీ ఆసాంతం తిలకించాను. మీరు రాసినట్లుగా ఈ సభలలో వైభవం, వైభోగం రెండూ ప్రస్ఫుటించాయి. ముఖ్యంగా మన సంస్కృతికి, సాహిత్యానికి ఈ సభలలో పెద్దపీట వేశారు. ప్రధాన వేదికపైన కూడా అధికశాతం మన సంప్రదాయ నృత్యాలకే ప్రాధాన్యతనిచ్చారు. ఎంతో శ్రమతో నిర్వాహకులు రూపొందించిన అన్ని కార్యక్రమాలు ఆహుతులను బాగానే రంజింపజేశాయి.

ద్వైవార్షిక సమావేశం సందర్భంగా ముద్రించిన స్రవంతి ప్రత్యేక సంచిక చూసి నాకు చాలా బాధ కలిగింది. ఈ సంచికకి స్రవంతి అని పేరు పెట్టారు. మొత్తం 320 పేజీలు ఉన్న ఈ సంచికలో 212 పేజీలను నాటాకి సంబంధించిన విశేషాలకి కేటాయించారు. వాటిలో 178 పేజీలు కేవలం నాటా సభ్యుల ఫోటోలు, వారి భజనకే కేటాయించుకోవడం గమనార్హం.

చివరలో 'సాహితీ స్రవంతి / కథలు –కవితలు–వ్యాసాలు' అంటూ కేటాయించిన 108 పేజీలకు కూడా సరైన న్యాయం జరగలేదు. ముఖ్యంగా ఈ స్రవంతి సంచిక ముఖచిత్రం తెలుగు సంస్కృతి, సంప్రదాయాలతో పాటు తెలుగుజాతిని సైతం తగులబెట్టేలా రూపొందించడం విచారకరం. స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ చేతిలో మండుతున్న దివిటీ మంటల్లో తెలుగువారిని పెట్టి తెలుగుజాతికే తీరని అవమానం చేశారు. ఎంతోమంది విద్యావంతులు, విజ్ఞాన వంతులు, మేధావులు ఉన్న సంస్థలో ఇంతటి ఘోర తప్పిదం జరగడం క్షమించరాని నేరం. ఆ ఘోరం ఎవరు చేసినా ఆ పాపం ఎవరిదైనా అవమానం మాత్రం యావత్ తెలుగుజాతిది..! ఈ లేఖ వెంట స్రవంతి ముఖచిత్రాన్ని జత చేస్తున్నాను. అవకాశం ఉంటే ముద్రించగలరు.

బాధాతప్త హృదయంతో....

ఓ తెలుగువాడు.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

# వేణుగానమ్ము వినిపించెనే..!

"గురువు, గోవిందుడు ఒకేసారి ఎదురుపడితే, ముందుగా నేను గురువుకే నమస్కరిస్తాను" అంటాడు భక్త కబీరుదాసు. ఆధ్యాత్మిక రంగానికి చెందిన గురువుల గురించి ఆయన ఆ మాట అన్నప్పటికీ, మోపూరు వేణుగోపాలయ్య గారు లాంటి విద్యారంగంలోని గురువులకు కూడా ఆ వాక్కు వర్తిస్తుంది. అటువంటి మాస్టార్లకు చేతులెత్తి మొక్కాలనిపిస్తుంది.

నేను వేణుగోపాలయ్య గారి విద్యార్థినీ కాను, వారితో నాకు ప్రత్యక్ష పరిచయమూ లేదు. వారి పేరు మాత్రం చూచాయగా విన్నాను. అంతే. కానీ, వారి శిష్య బృందం సమర్పించిన "వేణునాదం" చదివాక "అయ్యో! ఆ అయ్యవారిని చూడలేకపోయానే" అన్న లోటు తెలిసింది.

వేణుగోపాలయ్య గారి శిష్య రత్నాలు వారి సంస్కారాన్ని అక్షరాలలో ఆవిష్కరించిన తీరు అమోఘం... అనిర్వచనీయం. గురు ఋణాన్ని ఈ రూపేణా తీర్చుకున్న ఆ శిష్యుల విధేయతకు వంద వందనాలు. పది కాలాలపాటు దాచుకునే "లైబ్రరీ ఎడిషన్"గా ఇటువంటి స్మారక సంచికను తీసుకురావడం అభినందనీయం. అలాగే, సాహిత్య విషయాలతో పాటు అమూల్యమైన నెల్లూరు సంగతులు కూడా పలు వ్యాసాల ద్వారా వివరంగా తెలుసుకునే అవకాశాన్ని ఎక్కువ కాలం ప్రవాసంలో గడిపిన నాలాంటి వారికి ఎంతో ఉపయోగకరం, ఆనందదాయకం.

ఈ సందర్భంగా మన నెల్లూరీయుడైన ఆచార్య ఆత్రేయ గారు అరవై ఏళ్ల క్రితం వ్రాసిన ఒక సినిమా పాట గుర్తుకు వస్తోంది. అది "వేణు గానమ్ము వినిపించెనే... చిన్ని కృష్ణయ్య కనిపించడే".

ప్రవచన సుధాకరుని 'వేణు'నాదం పేరుతో మాన్యశ్రీ మోపూరు వేణుగోపాలయ్య స్మారక సాహితీ సంచికను ఆసాంతం చదివిన తర్వాత నాకు వేణు గానమూ వినిపించింది... వేణుగోపాలయ్యా కనిపించాడు.

ఆ గుర్గువుకు శతకోటి వందనాలు.

మేడా మస్తాన్‌రెడ్డి, విశాఖపట్నం.

# మూగజీవాల గోడు పట్టించుకోండి

జిల్లాలో పెద్దసంఖ్యలో ఆవులు, గేదెలు వగైరాలున్నా అనేక గ్రామాల్లో నేటికీ పశువైద్యం అందనిద్రాక్షగానే ఉంటోంది. మూగజీవాలకు ఏ వ్యాధి వచ్చినా పట్టించుకునేవారు లేరు. వైద్యశాలలున్నా కొన్నిచోట్ల వైద్యులు లేకపోవడం విచారకరం. మారుమూల గ్రామాల నుంచి మండలకేంద్రాలకు వ్యాధులతో బాధపడుతున్న పశువులను తీసుకువచ్చి వైద్యులకు చూపించాలనుకుంటే ఆ సమయానికి వారుండడం లేదు. దీంతో మళ్ళీ వాటిని ఇళ్లకు తీసుకువెళ్ళడం పెద్ద సమస్యగా ఉంటోంది. ఇకనైనా పాడిరైతులు పడుతున్న ఈ కష్టాలను గుర్తించి పశువైద్యులు, సిబ్బంది ఆయా కేంద్రాల్లో నిర్దేశిత వేళల్లో కచ్చితంగా అందుబాటులో ఉండేలా చూడాలని జిల్లా ఉన్నతాధికారులను ప్రార్థిస్తున్నాము.

ఆర్. అల్లూరయ్య, మనుబోలు.

# గోరింటాకు అలంకారంలో.. వాసవి మాత



ఆషాడమాసాన్ని పురస్కరించుకుని నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో కొలువైవున్న ఆర్య వైశ్యుల ఆరాధ్యదైవం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈనెల 11న 250 కేజీల గోరింటాకు రెమ్మలతో వాసవి మాత అమ్మవారికి అద్భుతంగా అలంకారం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్బన్ ఆర్యవైశ్య సంఘం, మహిళా సంఘం, వాసవి సేవాదళ్, ఆర్యవైశ్య యువజన విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఈ వేడుక జరిగింది. ఆర్యవైశ్య ప్రముఖుడు, నెల్లూరు నగరాభివృద్ధి సంస్థ ఛైర్మెన్ ముక్కాల ద్వారాకనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఛైర్మెన్ సుంకు మనోహర్, కార్యదర్శి అయితా రామచంద్రరావు, కోశాధికారి పబ్బిశెట్టి శ్రీనివాసులు, అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పేర్ల సీతారామారావు, కార్యదర్శి జ్యోతిప్రసాద్, అర్బన్ ఆర్యవైశ్య మహిళా విభాగం అధ్యక్షురాలు గుండ్లపల్లి పద్మప్రియ, కార్యదర్శి వాయుగుండ్ల సుప్రియతో పాటు దేవస్థానం కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

# నెల్లూరులో జూదరుల అరెస్ట్

సింగిల్ నెంబర్లాట ఆడుతున్న ఏడుగురు జూదరులను నెల్లూరులోని వేదాయపాళెం పోలీసులు ఇటీవల అరెస్ట్ చేశారు. డైకస్‌రోడ్డులోని ఎన్‌సిసి కాలనీ మొదటి వీధిలో సింగిల్‌నెంబర్లాట నిర్వహిస్తున్న ఎం.నరసింహారావుతో పాటు షేక్ ఇస్మాయిల్‌ను అరెస్టు చేసి వారివద్ద నుంచి రూ.4500 స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా డైకస్‌రోడ్డులో ఆకస్మిక దాడులు చేసి సమీర్, రబ్బానీ, రహంతుల్లా, ఇక్బాయిల్‌లను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.5500 స్వాధీనం చేసుకున్నారు.



# మనుబోలు గంగమ్మకు.. ఆషాడమాసం పూజలు

మండలకేంద్రమైన మనుబోలులో చెరువుగట్టుపై కొలువైవున్న గ్రామశక్తి గంగమ్మ తల్లికి గ్రామస్తులు ఈనెల 9న ఎంతో వైభవంగా ఆషాఢమాసం పూజలు నిర్వహించారు. 'అమ్మా! గంగమ్మ తల్లీ.. కరుణించమ్మా' అంటూ మొక్కుకుని, గ్రామమంతా సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ గంగమ్మ అమ్మవారిని పూలమాలలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమాలకు పి.శివయ్య, ఎన్.సుబ్రహ్మణ్యం, మురళి తదితరులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## విజయ డెయిరీ మాజీ ఛైర్మెన్..
# గోపాలకృష్ణచౌదరి కన్నుమూత



నెల్లూరులోని ప్రముఖ సంస్థ విజయ డెయిరీకి ప్రఖ్యాతిని తెచ్చి, దాదాపు రెండున్నర దశాబ్దాల పాటు ఆ సంస్థకు సేవలందించి, రైతుల మన్ననలు పొందిన ముప్పవరపు గోపాలకృష్ణచౌదరి ఈనెల 8వ తేదీ రాత్రి కన్నుమూయడంతో స్థానిక ప్రజలు ఆవేదన చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, ఆరోగ్యం విషమించి తన నివాసంలోనే తుదిశ్వాస విడిచారు. ఆయన హయాంలో విజయ డెయిరీకి రూపురేఖలు దిద్ది, దానిని ఎంతగానో అభివృద్ధిచేశారని ప్రజలు ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. అంతేకాదు, జిల్లా పశుగణాభివృద్ధి ఏజెన్సీ ఛైర్మెన్‌గా కూడా ఆయన సుమారు అయిదేళ్ళ పాటు సేవలందించారు. తెలుగుదేశం పార్టీలో వివిధ హోదాల్లోనూ అంకితభావంతో పనిచేశారు. ఆయన సేవలు చిరస్మరణీయమని స్థానిక నాయకులు, రైతుసంఘాల వారు పేర్కొన్నారు. విజయ డెయిరీ ప్రస్తుత ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పలువురు బోర్డు సభ్యులు, ఉద్యోగులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆయన నివాసానికి వెళ్ళి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

## గోపాలయ్య లేని లోటు తీరనిది
### - భారత 13వ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

నెల్లూరులోని విజయ డెయిరీ మాజీ ఛైర్మెన్ ముప్పవరపు గోపాలకృష్ణయ్య చౌదరి మరణవార్త తెలిసిన వెంటనే, అమెరికా పర్యటనలో ఉన్న భారత 13వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు స్పందించారు. గోపాలయ్య తనకెంతో ఆత్మీయులని, ఆయన లేకపోవడం జిల్లా పాడిపరిశ్రమకు, పాడి రైతులకు తీరని లోటని ఆయన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. జిల్లాలో పాడిపరిశ్రమ అభివృద్ధికి, రైతులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు విజయ డెయిరీ ఛైర్మెన్‌గా గోపాలయ్య దీర్ఘకాలం విశేష సేవలందించారని, వ్యక్తిగతంగా కూడా ఆయన తనకెంతో ఆప్తులని వెంకయ్య పేర్కొన్నారు. గ్రామీణుల కష్టనష్టాలు బాగా తెలిసిన గోపాలకృష్ణయ్య ఇక లేకపోవడం విచారకరమని ఆవేదన చెందుతూ, ఆయన కుటుంబసభ్యులకు వెంకయ్య తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# అన్నదాతలను అవమానిస్తారా?
### కలెక్టర్ తీరుపై మండిపడ్డ సోమిరెడ్డి



'రైతులేంటి..ప్యాంట్లు వేసుకున్నారు. మీరేం రైతులు...రాజకీయాలు చేసేందుకు వచ్చారా?..వెళ్ళండి-వెళ్ళండి' అంటూ జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఇటీవల 'స్పందన' కార్యక్రమంలో తమ బాధలు చెప్పుకునేందుకు వచ్చిన రైతులతో అనుచితంగా మాట్లాడారంటూ మాజీమంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మండిపడ్డారు. ఈనెల 10న ఆయన రైతులతో కలిసి నెల్లూరులోని కలెక్టరేట్‌కు చేరుకుని, ఆ సమయానికి కలెక్టర్ లేకపోవడంతో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్‌ను కలిసి, సర్వేపల్లి నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలపై ఫిర్యాదుచేశారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ, రైతులు బయటపనులకు వచ్చేటప్పుడు ప్యాంట్లు వేసుకోకూడదా?.. అని ప్రశ్నించారు. కలెక్టర్ వ్యాఖ్యలు అన్నదాతలను అవమానించేవిధంగా ఉన్నాయన్నారు. ప్రజాసమస్యలను గాలికొదిలేసి స్పందన వేదికపై కూర్చుని రాజకీయాలు మాట్లాడడం కలెక్టర్‌కు తగదని విమర్శించారు. రైతులంటే కనీసం మర్యాదకూడా లేదా అని అంటూ, ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతన్నలంటే లెక్కలేకుండాపోయిందన్నారు. ఇకనైనా కనుపూరు చెరువులో అక్రమ తవ్వకాలను వెంటనే నిలిపేయాలని కోరారు. ఆ తవ్విన గుంటల్లో పడి అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనుపూరు చెరువును కాపాడుకునేందుకు రైతులతో కలిసి పోరాటానికి సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు.

**మంత్రి కాకాణి ధనదాహం.. సర్వేపల్లి చెరువులు సర్వనాశనం**

అనంతరం సోమిరెడ్డి కలెక్టరేట్ ఆవరణంలో విలేకర్లతో మాట్లాడుతూ అక్రమ తవ్వకాలపై, మంత్రి తీరుపై ధ్వజమెత్తారు. మంత్రి కాకాణి దెబ్బకు సర్వేపల్లి నియోజకవర్గంలో ఉన్న చెరువులు సర్వనాశనమవుతున్నాయని, మట్టి అమ్ముకునే స్థాయికి కాకాణి దిగజారిపోయాడన్నారు. కోడూరు చెరువు నుంచి కనుపూరు చెరువు వరకు దేనినీ వదలకుండా మట్టి, గ్రావెల్ తవ్వేసి నామరూపాల్లేకుండా చేశారని ఆయన విమర్శించారు.

# మహానేత డా. వైఎస్ జయంతి
### ఎంపీ ఆదాల ఆధ్వర్యంలో ఘన నివాళులు

మహానేత, దివంగత ముఖ్యమంత్రి, డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 74వ జయంతిని ఈనెల 8న వైకాపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సంబరంగా జరుపుకున్నారు. పలుచోట్ల అన్నదానాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రియతమ నేత పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు. నెల్లూరు నగరంలోని ప్రధాన కూడళ్ళలో వైఎస్ విగ్రహాల వద్ద ఆత్మీయ సమావేశాలు నిర్వహించి వైఎస్‌కు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు వైఎస్ చేసిన ప్రజాసేవా కార్యక్రమాలను గుర్తుకు తెచ్చుకున్నారు. తెలుగువారికి, తెలుగుజాతికి మహోన్నత సేవలు చేసిన డాక్టర్ వైఎస్ చిరస్మరణీయులని పేర్కొన్నారు. నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని జిల్లా వైకాపా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీకేకును కట్ చేసి అందరికీ పంచారు. ఈ సందర్భంగా ఎంపీ ఆదాల మాట్లాడుతూ, మహానేత వైఎస్ అటు రాష్ట్రానికి, ఇటు జిల్లాకు చేసిన సేవలు అద్వితీయమని కొనియాడారు. డాక్టర్



వైఎస్ అంటే సంక్షేమ పథకాల ప్రదాత అని అభివర్ణించారు. తొలుత వైకాపా కార్యాలయంలోని డా. వైఎస్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, డిసిసిబి మాజీ ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, నుడా ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డెప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, నాయకులు మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి, కార్పొరేటర్లు మొయిళ్ళ గౌరి, సత్తార్, మూలె విజయభాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి, నాయకులు స్వర్ణ వెంకయ్య, కోటిరెడ్డి, రావు శ్రీనివాస రావు(ఆర్‌ఎస్‌ఆర్), రియాజ్, పెంచలరెడ్డి, వంశీ, ఏసు నాయుడు, హరిబాబుయాదవ్, జీవీ ప్రసాద్, సురేష్‌రెడ్డి, మేఘనాథ్‌సింగ్, జీవన్‌ప్రసాద్, పాలకీర్తి రవి, పాశం శ్రీనివాసులు, అబూబకర్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

### 'నడిచొచ్చిన దారంతా'..
## కవితా సంపుటి ఆవిష్కరణ 16న

నెల్లూరుకు చెందిన ప్రముఖ కవయిత్రి పాతూరి అన్నపూర్ణ రచించిన 'నడిచొచ్చిన దారంతా' కవితాసంపుటిని ఈనెల 16వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు నెల్లూరు టౌన్‌హాలులోని ఏసీహాల్‌లో ఆవిష్కరించనున్నారు. ప్రముఖ నవలా రచయిత్రి డాక్టర్ పెళ్ళకూరు జయప్రద ఈ కవితాసంపుటిని ఆవిష్కరిస్తారని, ప్రముఖ కవి డా. భూసురపల్లి వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి కె.సదారావు విశిష్ట అతిథిగా పాల్గొంటారని, డా. సుంకర గోపాలయ్య పుస్తకాన్ని సమీక్షిస్తారని, నెల్లూరుజిల్లా రచయితల సంఘం (నెరసం) అధ్యక్షులు ఏ.జయప్రకాష్ సభకు అధ్యక్షత వహిస్తారని కవయిత్రి అన్నపూర్ణ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆరోజు సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు కవిసమ్మేళనం ఉంటుందని, కవులు -కవయిత్రులు, సాహిత్యాభిమానులు పాల్గొని ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## జాతీయ సైక్లిస్ట్‌కు సన్మానం

రక్తదానంపై అవగాహన పెంపొందించడానికి కలకత్తాకు చెందిన జయదేవ్‌రావ్ కలకత్తా నుండి బయలుదేరి దేశమంతటా సైకిల్ మీద తిరుగుతూ రక్తదానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను, రక్తదానంపై ఉన్న అపోహలను తొలగిస్తూ ప్రజలలో చైతన్యం నింపుతూ ఈనెల 11న రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ సెంటర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ కోశాధికారి సురేష్ కుమార్ జైన్, మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్, బయ్యా ప్రసాద్, యడవల్లి సురేష్ ఆయన్ను ఆహ్వానించి శాలువాతో సత్కరించారు. రెడ్‌క్రాస్ నెల్లూరు జిల్లా శాఖ కార్యదర్శి పి.మస్తానయ్య, కో-ఆర్డినేటర్ గంటా వెంకట రవికుమార్, మోటివేటర్ తదితరులు పాల్గొన్నారు.

# విజృంభించిన అంగన్‌వాడీలు
### సమస్యల సాధన కోసం.. తాడోపేడో తేల్చుకుంటామంటున్న నాయకులు



అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం ఎంతచెప్పినా పట్టించుకోవడం లేదని, ఉద్యమాన్ని ఉధృతం చేసైనా సరే, తమ డిమాండ్‌లను సాధించుకుని తీరుతామని అంగన్‌వాడీ నాయకులు బల్లగుద్ది చెప్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీల 36 గంటల నిరసన దీక్షల్లో భాగంగా, నెల్లూరు కలెక్టరేట్ వద్ద ఈనెల 11న జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీలు పెద్దఎత్తున ధర్నాందోళన నిర్వహించారు. ఏళ్ళతరబడిగా కష్టించి పనిచేసినా చివరికి ఉద్యోగ విరమణ సమయంలో చిల్లిగవ్వ కూడా ఇవ్వకుండా పంపుతున్నారని, ఇదెక్కడి అన్యాయమని అంగన్‌వాడీ మహిళలు ఈ సందర్భంగా కంటతడిపెట్టారు. కనీసం సగం జీతాన్నయినా పింఛన్‌గా అందించి అంగన్‌వాడీలకు జీవనభద్రత కల్పించాలని వారు కోరుతున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు తమ డిమాండ్ల వినతిపత్రం సమర్పించారు. ఈ ఆందోళనలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకురాళ్ళు వై.సుజాతమ్మ, షేక్ రహెనాబేగం, సిపిఎం నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాసులు, టీవీవీ ప్రసాద్, జనసేన నాయకులు పాల్గొన్నారు. మునిసిపల్ వర్కర్స్ యూనియన్, ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు ఈ ఆందోళనకు మద్దతు ప్రకటించారు.

## సాయిదర్బార్‌లో ఉచిత నేత్రవైద్య శిబిరం



నెల్లూరు బాలాజీనగర్ శివార్లలోని పద్మావతినగర్ సాయిదర్బార్ అద్దాలమందిరం ప్రాంగణంలో ఈనెల 9న మందిరం నిర్వాహకుల ఆధ్వర్యంలో రోగులకు ఉచిత నేత్ర పరీక్షలు చేశారు. మోదరన్ కంటి వైద్యశాలకు చెందిన డాక్టర్ హెచ్. భారతి, ఎం.సాయిరామ్‌చరణ్, రామసుబ్బారావు, డి.కుమారస్వామితో పాటు ఆసుపత్రి సిబ్బంది వచ్చి దాదాపు 5 వందలమందికి పైగానే రోగులకు కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు, అవసరమైనవారికి కళ్ళద్దాలు ఇచ్చారు. గురుపౌర్ణమి వేడుకల సందర్భంగా శ్రీ సాయినాథునికి విశేష పూజలు చేశారు. అనంతరం, నేత్ర చికిత్సా శిబిరం నిర్వహించారు. ఈ నేత్రపరీక్షల్లో 90 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించడం జరిగిందని, వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహింపజేస్తామని మందిరం ఛైర్మెన్ మధుసాయి తెలిపారు. ఆలయ గౌరవ సలహాదారు పాబోలు రామసుబ్బయ్య, బాబిసాయి, శ్రీ సాయిదర్బార్ భక్తమండలి సభ్యులు పర్యవేక్షించారు.

# నెల్లూరు కబుర్లు

## జులై 29 నుంచి ఆగస్టు 2 దాకా
# 'రొట్టెల పండుగ' వేడుకలు

ప్రపంచవ్యాప్త ఖ్యాతిగాంచిన నెల్లూరులోని బారాషహీద్ దర్గాలో రొట్టెలపండుగ వేడుకలకు భారీ సన్నాహాలు జరుగుతున్నాయి. రాష్ట్రం నలుమూలల నుంచే కాక దేశవిదేశాల నుంచి కూడా ప్రతిఏటా భక్తులు లక్షల సంఖ్యలో నెల్లూరు నగరానికి తరలివచ్చి దర్గాను దర్శించుకుని మొక్కులు తీర్చుకోవడం తెలిసిందే. ఈసారి జులై 29వ తేది నుంచి ఆగస్టు 2వతేదీ వరకు రొట్టెల పండుగ నిర్వహించాలని దర్గా నిర్వాహకులు సమాయత్తమయ్యారు. జులై 19 నిషాన్ గంధోత్సవం, 29న సందల్ మాలి, 30న గంధం ఉత్సవాలు నిర్వహించి 31వతేదీన రొట్టెల పండుగ నిర్వహిస్తామని, ఆగస్టు 1న తహలీల్ ఫాతెహా నిర్వహించి, 2న ముగింపు కార్యక్రమం చేపడతామని దర్గా నిర్వాహకులు తెలిపారు.

# రాహుల్‌పై అక్రమకేసులు దారుణం
## డిసిసి నేత చేవూరు



దేశస్వాతంత్య్రం కోసం పోరాటిన నెహ్రూ కుటుంబంలో జన్మించిన రాహుల్‌గాంధీపై అక్రమకేసులు పెట్టడం దారుణమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి విమర్శించారు. ఈనెల 11న నెల్లూరులోని ఇందిరాభవన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ విధానాలపై ధ్వజమెత్తారు. పెద్దపెద్ద ఆర్థికనేరాలు చేసినవాళ్ళను బీజేపీ ప్రభుత్వం పట్టించుకోకపోగా, వాటిని ప్రశ్నించిన రాహుల్‌పై కేసులు పెట్టడం అన్యాయమన్నారు. భారత్ జోడో యాత్రతో రాహుల్‌కు వచ్చిన ప్రజాదరణ చూసి ఓర్వలేక అక్రమ కేసులు పెడుతున్నారని, అందుకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్‌పార్టీ మౌనదీక్ష చేపడుతుందని తెలిపారు. నాయకులు తలారి బాలసుధాకర్, లేళ్ళపల్లి సురేష్‌బాబు, మోహన్, ఉడతా వెంకట్రావు, ఫయాజ్, ఏటూరు శ్రీనివాసులురెడ్డి, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శాకంబరి అలంకారంలో..
# శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారు



ఆషాఢమాసం శుక్రవారం(ఈనెల 7) రోజున నెల్లూరు దర్గామిట్టలో కొలువైవున్న శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారిని ఆలయ అర్చకులు శాకంబరి అలంకారంతో శోభాయమానం చేశారు. వివిధ ప్రాంతాలనుంచి తెప్పించిన వివిధ రకాల పుష్పాలు, సుమారు పాతిక రకాల కూరగాయలు, అనేకరకాల పండ్లతో అమ్మవారిని అలంకరించి విశేష పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక హారతులిచ్చి, కన్నులపండువగా పల్లకి సేవ చేపట్టారు. కొలపర్తి రమేష్‌కుమార్, సువర్ణలక్ష్మి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తరించారు.

## సిపిఎస్‌ను రద్దు చేయాలంటూ..
# కలెక్టరేట్ వద్ద ధర్నా



సిపిఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలంటూ ఇటీవల నెల్లూరు కలెక్టరేట్ వద్ద ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ధర్నాందోళన నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దాని స్థానంలో కొత్త పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టడం ఉద్యోగులను మభ్యపెట్టడానికేనన్నారు. ఏపీసిపిఎస్ఇఏ నాయకులు ధనరాజ్, ఎం.హరి, ఐ.పవన్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జివి చలపతిశర్మ, ఏపిటిఎఫ్ నాయకుడు పిచ్చిబాబు, ఎస్‌టియు నాయకుడు కె.నరసింహం, ఏపిటిఎఫ్ నాయకుడు దశరథరాములు, సిహెచ్ హజరత్ తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా కోర్టు ఆవరణంలో..
# కొత్త భవన సముదాయం
### ప్రారంభోత్సవం గావించిన హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శేషసాయి

నెల్లూరులోని మద్రాసుబస్టాండ్ సమీపంలో ఉన్న జిల్లా కోర్టు ఆవరణలో కొత్తగా న్యాయస్థాన భవన సముదాయం నిర్మించడంతో కోర్టుకు కొత్త కళ వచ్చింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి ఈ భవన సముదాయానికి ఈనెల 9న ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ శేషసాయి దంపతులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామిని, జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్‌తో పాటు పలువురు సీనియర్ న్యాయవాదులు సాదర స్వాగతం పలికారు. అనంతరం జస్టిస్ శేషసాయి పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. సంప్రదాయబద్ధంగా పూజలు చేసిన తర్వాత శిలాఫలకాలను ఆవిష్కరించి, కోర్టు కొత్త భవనసముదాయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రమేష్ దంపతులు, రాష్ట్ర బార్‌కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఉమామహేశ్వర్‌తో పాటు జిల్లాలోని పలు కోర్టుల న్యాయమూర్తులు, న్యాయవాదులు, పబ్లిక్‌ప్రాసిక్యూటర్లు పాల్గొన్నారు.

# నెల్లూరు ఆర్టీఓ చందన.. బాధ్యతల స్వీకరణ



నెల్లూరు ప్రాంతీయ రవాణాశాఖ అధికారి చందన ఈనెల 7న బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఉప రవాణా కమిషనర్ బి.చందర్‌ను కలిసి ఆమె విధుల్లో చేరారు. గత ఏడాది సెప్టెంబరులోనే ఆమె ఆర్టీఓగా నియమితులైన విషయం, ఆ తర్వాత శిక్షణ కోసం వెళ్ళడం తెలిసిందే. శిక్షణ పూర్తయ్యాక వచ్చి బాధ్యతలు స్వీకరించారు. తొలుత డిటిసి చందర్‌తో కలిసి అడ్వాన్స్‌డ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ పనులను పరిశీలించారు. అనంతరం కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఎంవిఐలు బాలమురళీకృష్ణ, మురళీమోహన్, ఏఓలు కిషోర్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# నేత్రపర్వం.. శ్రీ షిరిడీ సాయినాథుని నగరోత్సవం



గురుపూర్ణమి ఉత్సవాల సందర్భంగా నెల్లూరు గాంధీబొమ్మ కూడలి వద్ద ఉన్న గాంధీనగర్‌లోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో కన్నుల పండువగా వేడుకలు జరిగాయి. ఆలయ అర్చకులు శ్రీ సాయినాథుని శోభాయమానంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. జులై 3 నుంచి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వారం రోజులపాటు అత్యంత వైభవంగా జరిగిన ఈ వేడుకల్లో భాగంగా సాయినాథునికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, సామూహిక అష్టోత్తర సహస్రనామ పూజలు, పూలంగిసేవలు పెద్దఎత్తున జరిగాయి. సాయినామ స్మరణలతో ఆలయం మార్మోగింది. మందిరం ఛైర్మన్ మన్నెం అమరనాథరెడ్డి, సభ్యులు కొల్లు శ్యామసుందరరెడ్డి, దువ్వూరు జయమ్మ పర్యవేక్షణలో జరిగిన ఈ ఉత్సవాలు భక్తులకు కనువిందు చేశాయి. ఈనెల 10వ తేది సోమవారం రాత్రి స్వామివారి నగరోత్సవం అంగరంగవైభవంగా జరిగింది. వేలాదిమంది భక్తులతో గాంధీబొమ్మ కూడలి, ట్రంకురోడ్డు మీదుగా పురవీధుల్లో నగరోత్సవం కొనసాగింది. తొలుత, వివిధ రకాల సుగంధభరిత పూలమాలికలతో బాబావారిని అలంకరించి సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. పురవీధుల్లో భక్తులు అడుగడుగునా శ్రీ సాయినాథునికి కొబ్బరికాయలు సమర్పించి, కర్పూర హారతులిచ్చారు. కోలాటాల కోలాహలం, డోలు, శాక్సాఫోన్ వాద్యాలు, భద్రకాళీ విన్యాసాలతో సాయిబాబా నగరోత్సవం భక్తులను బాగా ఆకట్టుకుంది.

# 'తంగిరాల మహాభారతం' 63వ భాగం




యమలోకంలో నివసిస్తున్న పాండురాజు, నారదునితో తన కుమారుడు ధర్మరాజుని రాజసూయయాగం చెయ్యమని, దానివలన పితృపితామహులకు స్వర్గలోక ప్రాప్తి కలుగుతుందని చెపుతాడు. నారదుడు అది ధర్మరాజుకి చెప్పి, ప్రోత్సహిస్తూ... కానీ ఆ యాగం వలన దారుణ సంగ్రామం జరుగగలదని చెపుతాడు. ధర్మరాజు దిగులు చెంది, తమ్ముళ్ళను, ఆప్తమిత్రులని, ధౌమ్య, వేదవ్యాసుని సంప్రదించి, రాజసూయయాగం చెయ్యటానికి నిశ్చయించుకుంటాడు. కృష్ణునికి కబురు చేసి సలహా అడుగుతాడు. శ్రీకృష్ణుడు, ధర్మరాజుతో నీవు అన్నివిధాలా అర్హుడవని, అయితే జరాసంధుడనే మదోన్మత్తుడు దీనికి అడ్డు పడగలడని ఆయనకి చేద దేశాధీశుడైన శిశుపాలుడు, హంస, డీభకులనే మహా పరాక్రమవంతులు, భగదత్త మహీపతి, పౌండ్రక వాసుదేవుడు, పురుషోత్తముడు, ఇంకా చాలామంది రాజుల తోడువుందని చెపుతాడు. చాలామంది రాజులు జరాసంధునికి భయపడి రాజ్యాలు వదిలేసి, అరణ్యాల్లో దాక్కున్నారు. జరాసంధుడు రాజులని ఓడించి, బంధించి, రోజుకొకరిని చొప్పున భైరవ పూజకి బలి ఇస్తున్నాడు.

ఒకసారి జరాసంధుడు, హంస, డీభకులతో ద్వారకమీదకు దండెత్తినప్పుడు, మేమేమి చెయ్యలేక, ఒక ఉపాయంతో హంస, డీభకులు తమంతట తామే మరణించేటట్లు చేసినప్పుడు, జరాసంధుడు తగ్గి తిరిగి వెళ్ళిపోయాడు. అయినా మేము పారిపోయి రైవతక పర్వతం మీద కోట నిర్మించుకుని ఉన్నాము. జరాసంధుని చంపితే తప్ప రాజసూయయాగం నిర్వహించలేమని, అయినా తమ్ముళ్ల భుజ పరాక్రమశక్తితో సాధించలేనిది లేదని ప్రోత్సహిస్తాడు.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది.
పూర్తి నిడివి కోసం
Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.






# వెంకయ్య సేవలు అపూర్వం

## ప్రశంసిస్తూ ప్రత్యేక తీర్మానం చేసిన..న్యూజెర్సీ సెనేట్

భారత 13వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడుకు అరుదైన గౌరవం లభించింది. మానవాళి సంక్షేమానికి, ప్రత్యేకించి అమెరికా–భారత్‌ల స్నేహబంధం మరింత బలోపేతం కావడానికి, ఇంకా అనేకానేక రంగాల్లో ఆయన చేస్తున్న విశిష్ట సేవలను కొనియాడుతూ ఇటీవల అమెరికాలోని న్యూజెర్సీ రాష్ట్ర జనరల్ అసెంబ్లీ, సెనేట్‌లో తీర్మానం చేయడం విశేషం. 'న్యూజెర్సీతో పాటు అమెరికావ్యాప్తంగా ప్రవాస భారతీయుల ప్రయోజనాల కోసం ముప్పవరపు వెంకయ్యనాయుడు అద్భుతమైన కృషిచేస్తున్నారు. భారత్‌లో విశేష ప్రజాభిమానాన్ని పొందిన ఆయన సామాజిక చైతన్యానికి ఎంతగానో పాటుపడుతున్నారు'..అంటూ ఆ తీర్మానంలో వారు ప్రస్తుతించారు. న్యూజెర్సీలోని సెనేటర్ డయాగ్నన్, జనరల్ అసెంబ్లీ సభ్యులు కారాబిన్చక్, స్టేన్లీ అలా సంయుక్త తీర్మానం చేయగా, సెనేట్ ప్రెసిడెంట్ నికోలస్ పిస్కటరి, జనరల్ అసెంబ్లీ స్పీకర్ క్రైగ్ జె కఫ్లిన్ ఆ తీర్మానంపై సంతకాలు చేశారు. '2017 నుంచి 2022 వరకు భారత ఉప రాష్ట్రపతిగా సేవలందించిన వెంకయ్యనాయుడు, ఆ పదవిని అలంకరించకముందు కేంద్రంలో వివిధ మంత్రిత్వశాఖల బాధ్యతలనుచేపట్టి, భారత్–అమెరికాల మధ్య రాజకీయ, సాంస్కృతిక, వాణిజ్య సంబంధాలు మరింత పటిష్టంగా ఉండేందుకు ఆయన చేసిన కృషిని గౌరవిస్తున్నాం'.. అంటూ ఆ తీర్మానంలో వారు ప్రస్తుతించారు. పెన్సెల్వేనియా రాష్ట్రం ఫిలడెల్ఫియాలోని కన్వెన్షన్ సెంటర్‌లో ఈనెల 8వ తేది జరిగిన 'తానా' 23వ మహాసభల సందర్భంగా న్యూజెర్సీలోని జనరల్ అసెంబ్లీ సభ్యుడు స్టేన్లీ ఆ తీర్మానపత్రాన్ని వెంకయ్యనాయుడుకు అందజేశారు. 'ఇది వసుధైక కుటుంబ స్ఫూర్తి ధర్మాన్ని ఆచరించే భారతీయులకు దక్కిన గౌరవంగా తాను భావిస్తున్నా'నని వెంకయ్యనాయుడు ఈ సందర్భంగా తన స్పందన తెలియజేశారు.

### హమ్మయ్య...

# ముత్తుకూరు గేటు సెంటర్‌లో ఫ్లైఓవర్ వచ్చేసింది!

ఇంకా ఎక్కడి ముత్తుకూరు గేటు అనుకుంటున్నారా...? అవునండోయ్... ఈ తరం వారికి బహుశా ఆ పేరు తెలియదేమో. రామలింగాపురం సెంటరనో, హరనాథపురం జంక్షన్ అనో, లేక ఆనం వెంకటరెడ్డి కూడలనో అంటే తెలుస్తుందేమో. ఈ ప్రాంతం ఒకప్పుడు ముత్తుకూరు గేటు సెంటర్‌గానే ప్రసిద్ధి. ఆ తరువాత అక్కడ గేటు తీసేసి అండర్ బ్రిడ్జి కట్టారు. ఆ బ్రిడ్జి కట్టిన తరువాత ఈ కూడలి రామలింగాపురం సెంటరుగా ప్రసిద్ధి చెందింది. కాలక్రమంలో హరనాథపురంలో రత్నం మాస్టారు, ఆయన శిష్యరికంలో నారాయణ సారు అనేక విద్యాసంస్థలను ప్రారంభించి ఆ ప్రాంతాన్ని ఎడ్యుకేషనల్ హబ్‌గా మార్చేయడం, దక్షిణం వైపు నుండి వచ్చి కొత్తగా ఏర్పడిన మినీబైపాస్ రోడ్డు ఈ ప్రాంతంలోని మూడు రోడ్లకి జత కావడంతో ఈ కూడలికి హరనాథపురం జంక్షన్ అని కూడా పేరొచ్చింది. ఆ తరువాత ఇక్కడ ఆనం వెంకటరెడ్డి విగ్రహం పెట్టడంతో వెంకురెడ్డి బొమ్మ సెంటర్ అని కూడా కొంతమంది పిలుచుకునేవారు.



ఇప్పుడా సోదంతా ఎందుకులెండి. మొత్తానికి ఈ కూడలికి ఇన్నాళ్ళకి మోక్షం లభించింది. దక్షిణం నుండి ఉత్తరం వైపు వెళ్లే విధంగా ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మించారు. మినీబైపాస్‌లో ఆత్మకూరు బస్టాండు నుండి వేదాయపాలెం వెళ్లే వాళ్ళు, ఇటు వేదాయపాళెం నుండి రైల్వేస్టేషన్‌కి వెళ్ళే వాళ్ళు ఈ కూడలి దగ్గర ట్రాఫిక్ మహమ్మారి నుండి తప్పించుకుని రయ్.. రయ్ మని వెళ్లిపోవచ్చు.

జులై 8వ తారీఖున దివంగత మహానేత డాక్టర్ రాజశేఖరరెడ్డి జన్మదిన కానుకగా అధికారులు ఈ బ్రిడ్జిపై ట్రాఫిక్ వదిలేశారు. ఎలాంటి హంగు ఆర్భాటం లేకుండా, రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు ప్రగల్భాలకు తావు లేకుండా పూజా కార్యక్రమాన్ని నిర్వహించి ముందుగా గోమాతని బ్రిడ్జిపైకి వదిలి, ఆ తరువాత సామాన్య జనాన్ని పంపించి బ్రిడ్జిని నెల్లూరీయులకు అంకితం చేశారు. కొత్తగా నిర్మించిన బ్రిడ్జి, తాజాగా వేసిన రోడ్డు కావడంతో వాహనదారులు హాయిగా ఈ కూడలి దాటేస్తున్నారు.

### పైన పటారం... కింద లొటారం

బ్రిడ్జిపైన బాగానే ఉంది, క్రింద సర్వీస్‌రోడ్డులోనే వాహనదారులకు నరకం కనిపిస్తుంది. రోడ్డు మొత్తం తవ్వేసి ఉన్నారు. మోకాలు లోతు గుంతలు. వీలయినంత త్వరగా ఈ రోడ్డు కూడా వేయకపోతే నగరంలో కీళ్లు ఎముకల డాక్టర్‌లకి డిమాండ్ పెరిగిపోతుంది. అధికారులు, కాంట్రాక్టరు తొందరగా దయతలిస్తే ప్రజలకి మేలు చేసిన వాళ్లవుతారు.

### రాష్ట్రంలోనే.. రెండవ ఎత్తైన నివాస వాడ

### • నగరానికి.. మహానగర శోభ

# మన నెల్లూరులో.. 23 అంతస్తుల మేడ

***అ**వును ఇది నిజమే...! మన నెల్లూరులో 23 అంతస్తుల మేడ(అపార్ట్‌మెంట్) అందుబాటులోకి రానుంది. ఆంధ్ర రాష్ట్రంలోనే రెండవ ఎత్తైన మేడని 'యూనిక్ స్పైర్' అనే పేరుతో 'యూనిక్ ప్రాజెక్ట్స్' అనే నిర్మాణ సంస్థ నగరంలోని ముత్తుకూరు రోడ్డులో నిర్మించబోతోంది. ముంబై, కోల్‌కత్తా, హైదరాబాదు, చెన్నై, బెంగళూరు వంటి మహానగరాలకే పరిమితమైపోయిన ఆకాశహర్మ్యాల సంస్కృతి ఇప్పుడు నెల్లూరుకి కూడా వచ్చేసింది. హరనాథపురానికి అతి సమీపంలో నెల్లూరు నుండి ముత్తుకూరుకి వెళ్లే ప్రధానమార్గంలో ఈ 23 అంతస్తుల మేడ నిర్మాణం చకచకా జరుగుతోంది.*

### వివరాలను ఒక్కసారి గమనిస్తే...

ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న సుదీర్ఘ తీర ప్రాంతంలో దక్షిణ భాగంలో నిర్మితమవుతున్న తొలి అత్యంత ఎత్తైన కట్టడం 'యూనిక్ స్పైర్'. ఆకాశమే హద్దుగా 23 అంతస్తులలో అత్యంత అధునాతన విలాసవంతమైన గృహ ప్రాంగణంగా ఈ అపార్ట్‌మెంట్ రూపుదిద్దుకుంటోంది. మొదటి మూడు అంతస్తులను నివాసితుల సౌకర్యార్థం అదనపు వసతుల కోసం వదిలిపెట్టారు. విశాలమైన డబుల్ రూఫ్‌తో డిజైన్ చేసిన రిసెప్షన్‌తో పాటు క్లబ్‌హౌస్, ఇండోర్ క్రీడా విభాగాలు, జిమ్, బాంక్వెట్ హాల్, మల్టీపర్పస్ హాల్, స్విమ్మింగ్ పూల్, స్పా తదితర సదుపాయాలను ఏర్పాటు చేయడం కోసం 30వేల చదరపు అడుగులను కేటాయించారు. భవన ప్రాంగణంలో ఆహ్లాదకరమైన పచ్చదనం, చిన్నపిల్లల ఆటవిడుపు కోసం పార్కు, క్రికెట్ ప్రాక్టీస్ కోసం నెట్, నడక కోసం జాగింగ్ ట్రాక్, టెన్నిస్ కోర్టులతో పాటు అదనపు ఆకర్షణగా యాంఫి థియేటర్‌ని కూడా ఏర్పాటు చేస్తున్నారు.

ఇక నివాస గృహాల విషయానికి వస్తే 4311 చదరపు అడుగుల నుండి 4770 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఫ్లాట్లను అందుబాటులోకి తెచ్చారు. వంద శాతం వాస్తుని అనుసరిస్తూ ప్రతి ఫ్లాటునీ తీర్చిదిద్దడంలో జాగ్రత్తలు తీసుకున్నారు. 4వ అంతస్తు నుండి మొదలై 23వ అంతస్తు వరకు ఒక్కొక్క అంతస్తులో 4 నివాసగృహాల (ఫ్లాట్స్) చొప్పున ఈ అపార్ట్‌మెంట్‌లో మొత్తం 80 ఇళ్ళు ఉంటాయి. సాధారణంగా పెద్ద నగరాలలో 100 లేదా అంతకుపైన ఫ్లాట్స్ ఉండే అపార్ట్‌మెంట్‌లలో కల్పించే అదనపు సౌకర్యాలకన్నా ఎక్కువ శాతం కేవలం 80 ఫ్లాట్స్ మాత్రమే ఉన్న 'యూనిక్ స్పైర్'లో సంస్థ అందిస్తోంది.

జాతీయస్థాయిలో గుర్తింపుపొందిన ఇంజనీర్ల పర్యవేక్షణలో, నిర్మాణంలో ఎక్కడా రాజీపడకుండా, నాణ్యతలో ఏమాత్రం లోపం లేకుండా పటిష్టమైన కట్టుబడి ఉండేలా చర్యలు తీసుకున్నామంటోంది యూనిక్ ప్రాజెక్ట్స్ యాజమాన్యం.

### యువ నెల్లూరీయుల సారధ్యంలో...




గిలకా నరేంద్ర

వారి జన్మభూమి నెల్లూరు జిల్లా. చిన్నప్పటినుండీ వాళ్ళు ఆడుతూపాడుతూ పెరిగిన ఊరు, స్నేహితులతో కలసి తిరిగిన నేల నెల్లూరు. మారుతున్న కాలంతో పాటు మార్పులు సంతరించుకుంటూ ఎప్పటికప్పుడు కొత్తదనంతో ఎదుగుతున్న నగరాన్ని చూస్తూ వాళ్ళు పెరిగారు. వ్యాపారరీత్యా ఇతర ప్రాంతాలలో స్థిరపడినా తాము పుట్టిన ఊరంటే వారికి మమకారం. ఆ అభిమానమే దక్షిణ కోస్తాలోనే తొలి 23 అంతస్తుల అరుదైన, ఎత్తైన గృహ సముదాయాన్ని ప్రతిష్టాత్మకంగా నెల్లూరులో నిర్మించడానికి ఈ యువ వ్యాపారవేత్తల చేత శ్రీకారం చుట్టించింది.

మీ ఇల్లెక్కడ అంటే ఫలానా 'యూనిక్ స్పైర్' అపార్ట్‌మెంట్‌లో అని గర్వంగా, అదొక స్టేటస్ సింబల్‌లా చెప్పుకునే విధంగా నెల్లూరులో తమ తొలి ప్రాజెక్టుని తీర్చిదిద్దుతున్నారు ఈ యువ నిర్మాణ సారధులు. గిలకా నరేంద్ర, పందిళ్ళపల్లి హేమంత్‌రెడ్డి, పచ్చిపాల సనత్‌రెడ్డిల కుటుంబ సభ్యులు పందిళ్ళపల్లి సింధురెడ్డి, పచ్చిపాల దీప్తిరెడ్డి, గిలాకా సతీష్‌ల భాగస్వామ్యంలో నెల్లూరులో 'యూనిక్ ప్రాజెక్ట్స్' ప్రారంభించి ఈ అత్యాధునిక గృహ సముదాయాన్ని నెల్లూరీయులకు కానుకగా అందిస్తున్నారు. మహానగరాల తరహాలో అత్యంత ఆధునిక వసతులతో, సౌకర్యవంతమైన, విలాసవంతమైన, వైభోగవంతమైన ఇల్లు కావాలనుకునేవారికి కేరాఫ్ అడ్రస్ 'యూనిక్ స్పైర్'.

'యు నేమ్ ఇట్ యు విల్ గెట్ఇట్' అన్నట్లుగా అన్ని వసతులను కల్పించి, 'నెవెర్ బిఫోర్.. ఎవర్ ఆఫ్టర్' అన్న స్థాయిలో నెల్లూరులో ఈ అద్భుతమైన 23 అంతస్తుల నివాస సముదాయాన్ని అందిస్తున్న యువ సారధులకు... అల్ ది బెస్ట్..!



# పేదల పెన్నిధి.. సిఎం జగన్

## - కొనియాడిన కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పాలిట పెన్నిధిగా ఉంటూ, పేదల అభ్యున్నతికి అవసరమైన అన్ని సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని, సీఎం చేపట్టే ప్రతి సంక్షేమ కార్యక్రమం ఒక అద్భుతమని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కొనియాడారు. ఈనెల 8న ఆయన బుచ్చిరెడ్డిపాళెం పంచాయతీలోని ఇస్కపాళెం-1 సచివాలయంలో జరిగిన 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో నియోజకవర్గ స్పెషలాఫీసర్ డిపిఓ సుస్మితరెడ్డితో కలసి పాల్గొని ఆ పథకం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. గతంలో ఏవైనా సర్టిఫికెట్లు కావాలంటే ప్రజలు కాళ్ళరిగేలా అధికారులు చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడా పరిస్థితి సమసిపోతోందని ఆయన చెప్పారు. బుచ్చి ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, సీనియర్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, నాయకులు కోడూరు మధుసూదన్‌రెడ్డి, నల్లపరెడ్డి రంజిత్‌కుమార్‌రెడ్డి, నగర కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, తహశీల్దార్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్



# పేద ప్రజల ఆరాధ్య దైవం వైయస్సార్

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి పేద ప్రజల ఆరాధ్య దైవమని ఆయన ఆశయాలకు అనుగుణంగా వైజేపీ సీనియర్ నాయకులు బత్తిని విజయకుమార్ వైయస్సార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేయడం స్ఫూర్తిదాయకమని గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ వెలగపల్లి వరప్రసాదరావు పేర్కొన్నారు. వైయస్సార్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో జులై 8న జరిగిన వైయస్ రాజశేఖర్‌రెడ్డి 74వ జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా భారీ కేకును కట్‌చేసి అందరికి పంచిపెట్టారు. అనంతరం 200మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. వైసిపి సిఇసి రాష్ట్ర సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు బత్తిని విజయకుమార్, గూడూరు వైసీపీ పట్టణ అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసులు, జిల్లా అధికార ప్రతినిధి నాసిన నాగులు, గూడూరు మండల కన్వీనర్ మల్లు విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## రోటరీ అసిస్టెంట్ గవర్నర్‌గా మయూరి శ్యామ్‌యాదవ్

2023-24 సంవత్సరానికి గాను రోటరీ కోస్టల్ జోన్-2 అసిస్టెంట్ గవర్నర్‌గా కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గాలో ఇటీవల డాక్టర్ శ్యామసుందరరావు (మయూరి శ్యామ్‌యాదవ్) ప్రమాణ స్వీకారం చేశారు. రోటరీ అంతర్జాతీయ డైరెక్టర్ అనిరుద్ధ్‌రాయ్ చౌదరి ఆయన చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో 3160 డిస్ట్రిక్ట్ గవర్నర్ మాణిక్ ఎస్ పవర్, పిడిజిలు బొమ్మిరెడ్డి సురేంద్ర రెడ్డి, కొణిదల మునిగిరీష్, భరత్‌కుమార్ రెడ్డి, ఒమ్మిన సతీష్‌బాబు, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు, గూడూరు రోటరీ మెయిన్ అధ్యక్షుడు రామకృష్ణ స్వరూప్, కావలి రోటరీ అధ్యక్షుడు దినేష్, కార్యదర్శి మోహన్‌రెడ్డి, కోస్టల్ మరియు సింహపురి జోన్ కో-ఆర్డినేటర్ మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సమాజ సమస్యలపై గళమెత్తిన.. 'దాహం.. దాహం'

చిన్ని నారాయణరావు నెల్లూరులో వృత్తిరీత్యా ఆడిటర్. ప్రవృత్తిరీత్యా కవి. కవిత్వం ఆయనకొక తీరని దాహం. తన వృత్తిలో తాను తీరకలేకుండా ఉంటూనే ఆయన కవిత్వాన్ని అలవోకగా సృజిస్తూ ఉంటారు. సారస్వత సమావేశాలు నిర్వహిస్తూ ఉంటారు. ఆ విధంగా ఆరు కవితా సంకలనాల తర్వాత వచ్చిన దీర్ఘకవిత 'దాహం దాహం'.

కవి సమాజంలో భాగమే! ప్రస్తుత వర్తమాన స్థితులను చూసి, చలించకుండా వుండలేడు. అలా చలించినవాడు ఆవేశం పొందుతాడు. ఆ ఆవేశంలో ధ్వని, లయ తప్పకుండా ఉంటుంది. ఇదే ఈ దీర్ఘకవిత సృజనకు మూలం.


మానవుడికి ఎండవేడిమికి 'దాహం' కలగడం సహజం. ఒక గ్లాసుడు మంచి నీళ్లతో ఆ దాహం తీరవచ్చు. లేకపోతే చెంబుడు నీళ్లతో తీరుతుంది. ఇది శారీరకమైన దాహం. కానీ, నేడు మానవునిలో ఏర్పడుతున్న అనేక రకాల 'దాహాలు' ఎంతకీ తీరవు. ఏనాటికీ తృప్తి పొందవు. అలాంటి పదమూడు రకాల దాహాల గురించి చిన్ని నారాయణరావు చక్కటి, చిక్కటి సామాజిక పరిశీలనతో ఈ దీర్ఘ కవితను సృజియించడమే గాక, సమస్యలు, పరిష్కారాలను సైతం చెప్పడం ప్రత్యేకత.

నేటి కాలంలో యువకుల కామ దాహం గురించి కవి ఇలా ఆవేదన చెందుతారు. 'ఆడపిల్లని వేధించి మరీ ప్రేమించమని బలవంతం చేస్తున్నారు. తనకు దక్కకపోతే ఎవరికీ దక్కకూడదని ప్రేమికులు కత్తిపోట్లతో కసితీరా చంపుతున్నారు. ఈ దారుణ మనస్తత్వాన్ని కవి "ఇక ఈ రేయిని తెల్లారనీయను / ఆమె కోసం అంతటా నేనై విజృంభిస్తా / నా దాహాన్ని తీర్చుకుంటా / ఆమె కాదంటే 'ఫినిష్' విద్య తెలిసిందేగా" అంటారు. నేటి కామ దాహం ఎలా ప్రాణాంతకమవుతుందో తెలుస్తుంది ఈ పంక్తులు చదివితే.

'మనతనం' అనే దాహం కూడా పెచ్చరిల్లిపోతున్నది. కుల రాజకీయాలు ప్రబలిపోతున్నాయి. "ఇదో కాహళినాళిక / ఇదో రక్తదాహం / ఈ బంధుత్వాల బంధనాల్ని / తెంచి కూల్చిన రోజే నిజమైన ఉషస్సు / మన ఇంటి పెరటి చెట్టులా రోజా పూలు పూస్తుంది" అంటూ ఎంతో ఆవేదనలోనూ కవి ఆశావాదాన్ని వినిపిస్తారు. సమస్యకు పరిష్కారం చూపెట్టారు.

'వైద్య దాహం' గురించి చెప్తూ కవి "కోకిలల్లా పూలు పరవాల్సిన చోట / శిశిరాల్ని మూటగట్టి ఇచ్చే / దౌర్భాగ్య జీవుల్ని ఏమనాలి?" అంటూ ఇంకా ముందుకుపోయి "ఇరుసు విరిగితే టైరుకు పంచరేసినట్లు / ఇంజను లోపానికి గేర్లు సరిచేసినట్లు / కన్నీటి బొట్లుగా / నూతన ధన్వంతరీయంగా వర్ధిల్లుతున్న / సమాజమా నీకు జోహార్" అంటూ వైద్య రంగంలోని మాఫియాను, దాని అకృత్యాలను ఎంతో వేదనా భరితంగా చక్కటి ఖండికను కవి వెలయించి ఆలోచనలు రేకెత్తించారు.

'అధికార దాహం' ఎక్కువయిపోయింది. అధికారం పొందటానికి ఎంతటి నీచానికైనా వెనుకాడడం లేదు మన నాయకులు. అరాచకం విజృంభిస్తున్నది. మానవత్వం అడుగంటి పోతున్నది. కవి ఈ విషయాన్ని ఒక ఖండికలో "ఓ మనిషీ! నిశ్శబ్దాలు మస్తిష్క భూకంపాల్లో / బ్రద్దలవుతున్న అద్దాల మహళ్లు / అందుకే మనిషీ నీవొక వేటగాడివై / దాహతాపత్రయాలను అణివిచేసే / దిశగా యుద్ధం చెయ్" అంటూ జాతికి కర్తవ్యబోధ కూడా చేశారు కవి.




దాహం... దాహం
రచయిత:
చిన్ని నారాయణరావు
పేజీలు : 90 వెల. 120/-
ప్రతులకు : చిన్ని నారాయణరావు
శ్రీకేతనం, 27-1-171, ఆదిత్యనగర్, చిల్డ్రన్స్ పార్క్ రోడ్డు, నెల్లూరు - 524 003.
మొబైల్ : 94402 02942

కవుల గళాల మీద కూడా నిఘా నడిచే ప్రస్తుత పరిస్థితుల్లో కలాలు నిద్రపోతే, సాహితీవేత్తలు సమాజం పట్ల తమ బాధ్యతను విస్మరిస్తే, భావి తరాలు మనల్ని క్షమించవంటారు చిన్ని నారాయణరావు. అందుకే ఆయన ఈ నిరసన కావ్యాన్ని సమాజ హితాన్ని వాంఛిస్తూ వెలువరించారని భావించవచ్చు.

'వారసత్వ దాహం' పైనా చక్కటి ఖండిక రాశారు కవి. "మన వారసులు కాని వాడికి చోటివ్వడమేమిటి? వారసత్వం అలివికాని అనుబంధం కదా / ఎన్ని న్యాయాలు భువిపై విలసిల్లినా / బంధుత్వ న్యాయం / వారసత్వ న్యాయంలా / ఏదీ పరిమళించదు / మరేదీ పరవశించదు" అంటూ వ్యంగ్యధోరణిలో కవి సమాజానికి కళ్ళు తెరిపించాలని ప్రయత్నించారు.

'మైకు దాహం' గురించి చెప్తూ 'మైకు దాహంలో రాజకీయోపజీవుడు / కవీ ఇద్దరిదీ కుడి ఎడమే అవుతుంది / అంటూ ఇద్దరూ మైకులను అదిలించే వాళ్లే / ప్రేక్షకులను నిలువునా బెదిరించే వాళ్లే!" అంటూ వాస్తవాన్ని కళ్లకు కట్టారు కవి.

ఇలా చెప్పుకుంటూ పోతే, ఈ కావ్యం గురించి ఎంత చెప్పినా తక్కువే! ఆద్యంతం సామాజిక స్పృహతో అలరారిన ఈ కావ్యం సమాజం పట్ల కవి ఆందోళనకు అద్దం పట్టింది. సమకాలీన సమస్యలకు పరిష్కారం చూపించి ఆలోచనలు రేకెత్తింపజేసే కావ్య సృష్టి కావించిన కవి చిన్ని నారాయణరావును ఈ కావ్యం చదివిన ప్రతి పాఠకుడూ అభినందించకుండా వుండలేడు. ఆయన కలం నుండి మరిన్ని ఆలోచనాత్మకమైన కవితలు జాలువారాలని, సమాజానికి హితవు చేకూర్చాలని ఆశిస్తూ...




డాక్టర్ గంగిశెట్టి శివకుమార్
సెల్: 9441895343

# వైజేపీ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం



గూడూరు డిఆర్‌డబ్ల్యు కళాశాల ఆడిటోరియంలో జులై 9వ తేదీ వైజేపీ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సీనియర్ లయన్ ఎస్.ఎల్.ఎన్. స్వామి, కార్యదర్శిగా గోపినాథ్‌రెడ్డి, కోశాధికారిగా పి.వి.మనోజ్‌కుమార్‌లను ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్ కె.నాగేశ్వరరావు ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వైసీపీ సీనియర్ నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, ప్రముఖ వైద్యులు డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, ఆయన సతీమణి డాక్టర్ సి.రోహిణి, ప్రాస్పర్ స్కూల్ అధినేత బి.దశరథరామిరెడ్డి, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ ఎమ్.వెంకటేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా 2022-23 సంవత్సరంలో మహిళలకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణలో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు, ఇద్దరు మహిళలకు రెండు కుట్టుమిషన్లు ముఖ్యఅతిథుల ద్వారా లయన్ సీనియర్ సభ్యులు ఆర్.వి.రావు, 2022-23 క్లబ్ అధ్యక్షులు రవీంద్రరెడ్డిల సహకారంతో అందించారు. పి.మురళీకృష్ణ, జి.రాధాకృష్ణారెడ్డి, ఎస్.సుబ్రహ్మణ్యం, పి.చంద్రశేఖర్‌రెడ్డి, కె.వి.నారాయణరాజు, బి.సుధాకర్, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

# రౌడీషీటర్లకు డిఎస్పీ కౌన్సిలింగ్



రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, ఎటువంటి సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గూడూరు డిఎస్పీ సూర్యనారాయణరెడ్డి హెచ్చరించారు. గూడూరు పట్టణంలోని సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయంలో జులై 9వ తేదీ ఆయన రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలిసో తెలియకో నేరాలకు పాల్పడి రౌడీషీటర్లుగా ఉన్నవారు సత్ప్రవర్తనతో ఉండాలని, అటువంటి వారిపై రౌడీషీట్లు తొలగించడం జరుగుతుందని తెలిపారు. అల్లర్లు, గొడవలు సృష్టిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ దశరథరామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

# పాత పింఛను విధానాన్నే కొనసాగించాలి

## ఏబిఆర్ఎస్ఎం అధ్యక్షులు ప్రొ. వైవి రామిరెడ్డి



పాత పింఛను విధానమే ఎంతో మేలని, దానినే కొనసాగించాలని అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్షిక్ మహాసంఘ్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వైవి రామిరెడ్డి చెప్పారు. ఈనెల 9న ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నెల్లూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిపిఎస్ విధానం ఉద్యోగులకు నష్టమని, జిపిఎస్ తదితర పథకాలతో ఉపయోగం లేదని వివరించారు. పాత పింఛను విధానమే ఉద్యోగులకు ప్రయోజనకరమని స్పష్టం చేశారు. వచ్చేనెలలో తాము ఢిల్లీకి వెళ్తున్నామని, అక్కడ పార్లమెంట్ సభ్యులతో కలసి ఈ విషయం చర్చిస్తామని కూడా ఆయన తెలిపారు. 2007 నుంచి రాష్ట్రంలోని 32 విశ్వవిద్యాలయాల్లో ఎలాంటి నియామకాలు జరగలేదని, దీంతో అధ్యాపకుల కొరత ఏర్పడి విద్యార్థుల పరిస్థితి అయోమయంగా ఉందన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు రాజగోపాలాచారి తదితరులు పాల్గొన్నారు.

# ఆనం జయకు ఆశీస్సులు



ఇటీవలే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సమక్షంలో వైకాపాలో చేరిన ఆనం జయ కుమార్‌రెడ్డిని సుజాతమ్మకాలనీలోని ఆయన నివాసంలో ఇటీవల నెల్లూరులోని పలు దేవాలయాల ప్రముఖులు గౌరవపూర్వకంగా కలుసుకుని దైవప్రసాదాలను అందజేసి దీవించారు. నగరంలోని అయ్యప్పస్వామి దేవస్థానం కార్యదర్శి కెవి రత్నం, కమిటీ సభ్యులు బట్టేపాటి నరేంద్రరెడ్డి, బి.మురళీమోహన్‌రెడ్డిలు ఆయన్ను కలుసుకుని శాలువతో సత్కరించి శుభాకాంక్షలు చెప్పారు. అదేవిధంగా, దర్గామిట్టలో ఉన్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులు సన్నపురెడ్డి విజయకుమార్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు ఆనం జయకు అమ్మవారి ప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు.

# ఓటర్ల జాబితాలను చక్కదిద్దండి

కందుకూరు నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలను పునఃపరిశీలన చేయాలని, చనిపోయినవారి ఓట్లు, డబుల్ ఎంట్రీ ఓట్లు తొలగించాలని గతంలో కోరినా, నేటికీ వాటిని చక్కదిద్దలేదని కందుకూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. పోలింగ్‌బూత్‌ల వారీగా ఆ వివరాలను ఈనెల 10న స్పందన కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ శోభికకు అర్జీ ద్వారా తెలియజేశారు. 2023 జనవరిలో ప్రచురించిన ఓటర్ల జాబితాలో చనిపోయినవారి ఓట్లు వేల సంఖ్యలోనే ఉన్నాయన్నారు. ఇకనైనా వాటిని పరిశీలించి జాబితాను సరిదిద్దాలని ఆయన కోరారు.

# 23న 'ప్రజా సింహగర్జన'

రాష్ట్రంలోని దళిత, బహుజన, రైతు, శ్రామిక, మైనార్టీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా తాము త్వరలోనే రాజకీయపార్టీని స్థాపిస్తున్నామని, ఈ నేపథ్యంలో ఈనెల 23న గుంటూరు–విజయవాడ సమీపంలో ప్రజా సింహగర్జన సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, అప్పుడే పార్టీని కూడా ప్రకటిస్తామని బీసీ యువనేత బి. రామచంద్రయాదవ్ తెలిపారు. ఆ మేరకు ఆయన ఈనెల 7న నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ప్రజా సింహగర్జన సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన వైకాపా పాలనపై విమర్శలు గుప్పించారు. అనంతరం రామచంద్రయాదవ్‌ను బీసీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీహరిరావు, బొమ్మి నాగకిశోర్ యాదవ్, ఎస్ఎస్ యాదవ్, ఉల్లిపాయల శంకరయ్య, లీలాకృష్ణ, డాక్టర్ శ్యామ్‌ప్రసాద్, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏం తినేటట్టు లేదు..ఏం కొనేటట్టు లేదు

## కూరగాయల ధరలపై సిపిఐ వినూత్న నిరసన



వైకాపా ప్రభుత్వంలో నిత్యావసరాల ధరలు మండిపోతున్నాయని, చివరికి కూరగాయల ధరలు కూడా భగ్గుమంటున్నాయని, అయినా ధరల నియంత్రణను ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ సిపిఐ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 9న వారు నెల్లూరులోని విఆర్‌సి కూడలిలో నిరసన చేపట్టారు. కూరగాయల దండలు మెడలో వేసుకుని ఏం తినేటట్టు లేదు.. ఏం కొనేటట్టు లేదంటూ పాటలు పాడుతూ కార్యకర్తలు తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. సిపిఐ జిల్లా నాయకుడు అరిగెల నాగేంద్రసాయి మాట్లాడుతూ, పెట్రోలు, డీజిల్ ధరలతో పాటు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశానికంటుతున్నాయని, కూరగాయలు, పలసరుకులు, వంటనూనెల ధరలు అన్నీ పెరిగిపోవడంతో సామాన్య ప్రజల జీవనం అస్తవ్యస్తంగా మారిందని ఆవేదనతో చెప్పారు. పేదప్రజలైతే అంతంత ధరలు పెట్టి సరుకులు కొనలేక పస్తులతో అవస్తలు పడుతున్నారన్నారు. పెరిగిపోతున్న ధరలకు అడ్డుకట్ట వేయకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఈ నిరసనలో ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు వి.రామరాజు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు వాటంబేటి నాగేంద్ర, స్టాలిన్, ముక్తియార్, లీలామోహన్, సుబ్బరాయుడు, అజయ్‌బాబు, ఇజ్రాయిల్ పాల్గొన్నారు.

# వైకాపా లీగల్‌సెల్ జోనల్ ఇన్‌చార్జిగా.. రోజారెడ్డి

వైకాపా లీగల్ సెల్ నెల్లూరు, కడప, తిరుపతి జోనల్ ఇన్‌చార్జిగా రామిరెడ్డి రోజారెడ్డి నియమితులయ్యారు. గతంలో నెల్లూరు బార్ అసోసియేషన్ కార్యదర్శిగా, ప్రధాన కార్యదర్శిగా కూడా ఆయన న్యాయవాదులకు అండగా పలు కార్యక్రమాలు నిర్వహించి, వారి మన్ననలను అందుకున్నారు. రోజారెడ్డికి బార్ అసోసియేషన్ ప్రతినిధులు, పలువురు న్యాయవాదులు శుభాకాంక్షలు చెప్పి అభినందించారు. ఈ సందర్భంగా రోజారెడ్డి మాట్లాడుతూ, న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్‌సభ్యులు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, ట్రెజరర్ డి.రమేష్, మాజీ కార్యదర్శి టంగుటూరు గోపాల్‌రెడ్డి, ఎన్.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన మంత్రి కాకాణిని కలుసుకుని, వైకాపా లీగల్‌సెల్ జోనల్ ఇన్‌చార్జి పదవికి తనను ఎంపికచేయడంలో సహకరించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఏబీవీపీ శోభాయాత్ర



అఖిలభారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 7న నగరంలోని విఆర్‌సి సెంటర్‌లో ఏబీవీపీ విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక విఆర్‌కాలేజీ వద్ద ఈ యాత్రను ఏబీవీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పరిషత్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ, 1949 జులై 9న ఢిల్లీ యూనివర్శిటీలో అయిదుగురితో ప్రారంభమైన ఏబీవీపీ, అంచలంచెలుగా ఎదుగుతూ ఇప్పుడు 75వ సంవత్సరంలో అడుగుపెట్టిందన్నారు. ఏబీవీపీ ఆవిర్భావం నుంచి దేశవ్యాప్తంగా విద్యారంగ సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటం చేస్తోందన్నారు. ఇదే స్ఫూర్తితో ముందడుగు వేస్తామని, విద్యారంగానికి తమవంతు సేవలందిస్తామని చెప్పారు. ఏబీవీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధర్, కార్యవర్గసభ్యులు చందు, రాహుల్, నగర కార్యదర్శి యశ్వంత్, సహాయ కార్యదర్శి సాయి తదితరులు పాల్గొన్నారు.

# 'పేపర్ క్రాఫ్ట్' పోటీలకు ఆహ్వానం

ఆగష్టు 1న అంతర్జాతీయ కాగిత దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ, పేపర్ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, శ్రీశ్రీ ఏజెన్సీస్–నెల్లూరు సంయుక్త ఆధ్వర్యంలో "పేపర్ క్రాఫ్ట్" పోటీలకు ఆహ్వానం పలుకుతున్నామని, ఇందులో భాగంగా కాగితంతో వివిధ బొమ్మలు, వస్తువులను విద్యార్థులు తయారు చేయవచ్చునని, దీనితో పాటు చెత్తతో కళాఖండాలను కూడా రూపొందించవచ్చని నిర్వాహకులు తెలిపారు. నెల్లూరులోని అన్ని పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకుని విద్యార్థులతో కాగితాలతో వివిధ రకాల క్రాఫ్టులు తయారు చేయించి, పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు విజేతలను ఎంపిక చేసి వారి వివరాలు తమకు పంపాలని తెలిపారు. పాఠశాల స్థాయిలో ఎంపికైన వారితో జులై చివరి వారంలో ఎగ్జిబిషన్‌ను నిర్వహించి, 20 మంది విజేతలను ఎంపిక చేసి ఆగష్టు 1న వారికి అవార్డులు బహుకరిస్తామని తెలిపారు. జులై 20వ తేదీలోగా వివరాలు పంపాలని, వివరాలకు ఫోన్ నంబరు 94403 89999కు సంప్రదించవచ్చని వారు కోరారు.

# టూకీగా...



## రూ. 10.51 లక్షలకు పైగా 'మాలకొండ' ఆదాయం

కందుకూరు నియోజకవర్గం వలేటివారిపాలెం మండలంలోని మాలకొండ దేవస్థానానికి భక్తులు సమర్పించిన కానుకల ద్వారా ఈనెల 8న శనివారం ఒక్కరోజు 10 లక్షలా 51వేలా 905 రూపాయల రాబడి వచ్చినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.

## ఆమంచర్ల లెప్రసీకాలనీలో ఉచిత వైద్యశిబిరం

నెల్లూరు రూరల్ మండలంలోని ఆమంచర్లలో ఉన్న సేవా జ్యోతి లెప్రసీ కాలనీలో ఇటీవల ఉచిత వైద్యశిబిరం నిర్వహించి రోగులకు సేవలందించారు. స్థానిక వసంతలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకురాలు వసంతలక్ష్మి కుష్టువ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి మందుల కిట్‌లు అందజేశారు.

## కోవూరులో.. జగనన్న కాలనీల నిర్మాణాలపై సమీక్ష

మండలంలో జరుగుతున్న జగనన్న కాలనీల నిర్మాణాలపై కోవూరు ఎంపీడీఓ శ్రీహరి ఆధ్వర్యంలో ఇటీవల సమీక్ష నిర్వహించారు. నిర్మాణాలను వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. గృహనిర్మాణ శాఖ ఏఇ మాధవయ్య, వర్క్ ఇన్స్‌పెక్టర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## పెంచలకోనలో నిత్యాన్నదాన పథకానికి విరాళం

జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రాపూరు మండలంలోని పెంచలకోనలో వెలసివున్న శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి నెల్లూరుకు చెందిన భక్తులు వసంతరావు, కర్పకవల్లి దంపతులు ఇటీవల 50వేల రూపాయల విరాళం సమర్పించినట్లు ఆలయ ఇఒ కోవూరు జనార్దన్‌రెడ్డి తెలిపారు.

## శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి విశేషాభిషేకాలు

నెల్లూరు రూరల్‌లోని కొత్తకాలువ కూడలిలో కొలువైవున్న శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకులు ఈనెల 7న అమ్మవారికి ప్రత్యేక పూజలు, విశేషాభిషేకాలు చేశారు. స్థానిక ప్రజలు, భక్తులు పెద్దసంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు పర్యవేక్షించారు.

## వేపినాపిలో గర్భిణులకు ఆరోగ్యపరీక్షలు

రాపూరు మండలంలోని వేపినాపి గ్రామంలో ఈనెల 10న ప్రాథమిక వైద్యఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ ప్రమీలా రాజకుమారి ఆధ్వర్యంలో గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. రక్తపరీక్షలు చేసి, రక్తహీనత ఉన్నవారికి మందులు ఇచ్చారు. గర్భిణులు ఆరోగ్యంపట్ల అశ్రద్ధ చూపకూడదని, క్రమంతప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలని చెప్పారు.

## తాళ్ళూరులో సచివాలయం తనిఖీ

బోగోలు మండలంలోని తాళ్ళూరు గ్రామ సచివాలయాన్ని ఈనెల 10న ఎంపీడీఓ వెంకటసుబ్బారావు తనిఖీ చేశారు. సచివాలయంలో రికార్డులు సక్రమంగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. సిబ్బందికి అవసరమైన సూచనలిచ్చారు. జగనన్న సురక్ష కార్యక్రమం అమలుపై వలంటీర్లు శ్రద్ధ తీసుకుని ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను అందజేయాలన్నారు.

## శ్రీ మల్లికార్జునస్వామికి పల్లకిసేవ

కోవూరు గాంధీపార్కు సెంటర్‌లోని పార్వతి సమేత శ్రీ మల్లికార్జునస్వామి దేవాలయంలో ఈనెల 10న స్వామివారికి వేడుకగా పల్లకిసేవ జరిగింది. ఆలయ అర్చకుడు విశ్వనాథం సుబ్రామయ్య ప్రత్యేకపూజలు జరిగాయి. ఆలయ ఛైర్మన్ బి.సురేష్, ధర్మకర్తలు పి.మోహన్, ఏ. హనుమారెడ్డి, నాగరాజు, వంశీ తదితరులు ఈ వేడుకలను పర్యవేక్షించారు.

## నెల్లూరులో విద్యార్థులకు పఠనసామగ్రి

విద్యలో బాగా రాణించేందుకు తన వంతు సేవగా స్థానిక విద్యావికాస్ ట్రస్ట్ వారు నెల్లూరు దర్గామిట్ట జడ్పీ హైస్కూల్‌లో 8,9,10 తరగతుల్లోని 32 మంది మెరిట్ విద్యార్థులకు ఈనెల 10న పఠనసామగ్రి (స్టడీ మెటీరియల్)ని పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి, ట్రస్టు కోఆర్డినేటర్ కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పసలేని పలుకులతో...
# పలచనవుతున్న పవన్!

(మొదటి పేజీ తరువాయి)

మహిళల వివరాలు కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా ప్రకటిస్తూనే ఉంది. ఈ విషయంలో పూర్తి సమాచారం తెలుసుకోకుండా, అవగాహనారాహిత్యంతో పవన్ మాట్లాడడం హాస్యాస్పదం. పైగా తాను చేసిన ఆరోపణలోకి కేంద్ర ప్రభుత్వ నిఘావర్గాలను కూడా లాగడం అర్థరహితం.

అసలు పవన్ ఎవరు? ఆయన హోదా ఏమిటి..?? అత్యంత సూక్ష్మమైన అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పవన్ చెవిలో మాత్రమే ఊదేంత స్థాయి అసలు పవన్‌కి ఉందా...? ఆయన ఎంపీ కాదు, ఎమ్మెల్యే కాదు, కనీసం వార్డు మెంబర్ కూడా కాదు. సీటు, సింబలూ రెండూ లేని ఒక పార్టీకి అధ్యక్షుడు. ఆ పార్టీ నుంచి పోటీచేసి ఆయన నెగ్గలేదు. నెగ్గిన ఒకేఒక్క ఎమ్మెల్యే ఆయన వెనుక లేడు. మరి పవన్ కళ్యాణ్ ఎవరని కేంద్ర నిఘాసంస్థ ఈ విషయాలు ఆయన దృష్టికి తీసుకెళ్లిందన్నది ఇప్పుడు తేలాల్సిన అంశం. మహిళల అదృశ్యంపై అనేక జాతీయ సంస్థలు, ఎన్జీఓలు నిత్యం అధ్యయనాలు చేస్తూనే ఉంటాయి. కాబట్టి, ఇవి దాచేస్తే దాగే అంకెలు కావు. ఆ మాత్రం కనీస పరిజ్ఞానం కూడా ఈ జనసేనానికి లేకపోవడం విచిత్రం.

### 'కేరళ స్టోరీ' ఏపీలో రీమేక్

ఈమధ్యన 'కేరళ స్టోరీ' సినిమా పేరుతో ఆ రాష్ట్రంపై ఇలాంటి బురదే చల్లారు. కేరళలో కొన్ని వేలమంది అమాయక మహిళలు ఐసిస్ పాలయ్యారని సినిమాలో చెప్పారు. దీనిపై తీవ్ర దుమారం రేగేసరికి సినిమా నిర్మాతలు వెనక్కి తగ్గి అభ్యంతరకరంగా ఉన్న కంటెంట్ తొలగిస్తున్నామన్నారు. కాబట్టి ఇదేమీ అంత తేలికైన అంశం కాదు. పవన్ అదే సినిమా కులానికి చెందిన వ్యక్తే కాబట్టి, అదే స్క్రీన్‌ప్లేతో ఏపీ ప్రభుత్వంపై బురదేసే ప్రయత్నం చేశారు. అయితే, పవన్‌కళ్యాణ్ పసలేని ఆరోపణలపై ప్రభుత్వం, మహిళా కమిషన్, వలంటీర్లు స్పందించిన తీరుకి తగ్గట్టుగా పవన్‌కళ్యాణ్ ఆధారాలు సమర్పిం చడంలో విఫలమయ్యారు. ముందుగా మొత్తం వలంటీర్ల వ్యవస్థకు ఉమెన్ ట్రాఫికింగ్ మరకను అంటించిన పవన్, ఆ తర్వాత అందరూ కాదు కొద్దిమందనే తాను అన్నానంటూ తాను అన్న మాటకి కూడా కట్టుబడి ఉండలేకపోవడం గమనార్హం.

### స్థితప్రజ్ఞత లేదు...!

పవన్ కళ్యాణ్‌లో ఎప్పుడూ స్పష్టత, స్థితప్రజ్ఞత అన్నవి కనిపించవు. జీవితంలోనైనా, రాజకీయాల్లోనైనా అస్పష్టతే. తన పదేళ్ల రాజకీయ జీవితంలో వెనక్కి తిరిగి చూసుకుంటే, ఆయనకంటూ ఏ గుర్తింపూ లేదు. ప్రజల మనస్సుల్లో స్థానమూ లేదు.

ఒకసారి సనాతన ధర్మం అంటారు... ఇంకోసారి చెగువేరా అంటారు. ఒకసారి తనకు కులం లేదంటారు... కాపు కులంలో పుట్టినందుకు గర్వపడుతున్నానంటారు. ఒకసారి తెలంగాణలో పుట్టనందుకు బాధపడుతున్నానంటారు... ఇంకోసారి కడప వెళ్లి సిద్దవటంలో పుట్టాలని ఉందంటారు. మనల్ని ఎవడ్రా ఆపేది అంటారు.. ఎవరూ ఆపకుండానే ఆగిపోతుంటారు. సీఎం అవుతానంటారు.. మరోసారి సీఎం అయ్యే అర్హత తనకు లేదంటారు. గుండెల నిండా ధైర్యం ఉందంటారు... మెడలో మాత్రం తాయత్తు కట్టుకుంటారు. ఒకసారి నక్సలైట్ అవుదామనుకున్నానంటారు... ఇంకోసారి న్యూజిలాండ్ వెళ్దామని అనుకున్నానంటారు. రాజకీయాల్లో ఇంతటి అయోమయం ఉన్న నేత బహుశా ప్రపంచంలో ఎక్కడా ఉండకపోవచ్చు. ఆ భాగ్యం, అదృష్టం తెలుగురాష్ట్రాలకే దక్కింది.

### సమర్థించని బీజేపీ, టీడీపీ ..!

మహిళల అదృశ్యం విషయంలో జనసేనాని చేసిన ఆరోపణని అటు కేంద్ర ప్రభుత్వం కానీ, ఇటు పవన్ మార్గదర్శక పార్టీ టీడీపీ కానీ సమర్థించలేదు. పైపెచ్చు ఇలా పిచ్చి మాటలు మాట్లాడి ప్రజలలో చులకనైన తమ పార్టీల వారిలో ఉన్న కొద్దిపాటి ఆకర్షణని ఎక్కడ కోల్పోతామో అన్న ఆలోచనలో ఆ రెండు పార్టీలు ఉన్నాయని విశ్లేషకులు అంటున్నారు. అధికార పార్టీని ఇరుకున పెట్టాలని నోటికి ఏదొస్తే అది మాట్లాడడం మంచిది కాదని, అందువల్ల తమపార్టీకి నష్టం జరగడమే కాకుండా అధికార పార్టీ లాభపడుతోందని కూడా జనసైన్యమే లబోదిబోమంటోంది. నానా బాధలుపడి తమ నాయకుడి సభకి జనాన్ని సమీకరిస్తుంటే ఆయన ఇలా పసలేని పలుకులతో చులకనైపోతున్నాడని జనసేన పార్టీ నేతలే వాపోతున్నారు...!




# నెల్లూరు ఎంపీ ఆదాల బిజీబిజీ



నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ వైకాపా ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఈనెల 9, 10, 11 తేదీల్లో నగరంలోను, నెల్లూరు రూరల్‌లోనూ పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. స్థానిక వైకాపా నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన తన పర్యటనలో ప్రజలతో మాట్లాడుతూ, సమస్యలను తెలుసుకుంటూ, ఆ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఆయన వెంట విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డిసిసిబి మాజీఛైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, కార్పొరేటర్లు ఒరిస్సా శ్రీనివాసులురెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, నూనె మల్లికార్జునయాదవ్, నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, రావు శ్రీనివాసరావు(ఆర్ఎస్ఆర్), పుల్లారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సూరి, వై.వి.రెడ్డి, సుబ్బారెడ్డి, జడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి, వైసీపీ సేవాదళ్ అధ్యక్షుడు మాలెం సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈనెల 9న 23 డివిజన్లోని శిరోమణి నగర్, కావేరినగర్‌లలో జరిగిన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఆదాల పాల్గొని మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలకు అపూర్వ స్పందన లభిస్తోందన్నారు.

### పెద్దాసుపత్రిలో సమస్యలు తీరుస్తాం

నెల్లూరులోని ప్రభుత్వ పెద్దాసుపత్రిలో నెలకొని ఉన్న సమస్యలన్నిటిని త్వరలోనే తీరుస్తామని ఆదాల హామీ ఇచ్చారు. ఈనెల 11న ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఆధ్వర్యంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆదాల మాట్లాడుతూ, 3 నెలల క్రితమే పలు సమస్యలు తన దృష్టికి వచ్చాయని, వాటిని వెంటనే కలెక్టర్‌తో మాట్లాడితే 19 లక్షల రూపాయలను అప్పటి కప్పుడు మంజూరుచేసి పలు సమస్యలను పరిష్కరించారని చెప్పారు. ఆసుపత్రి సమస్యలను సంబంధిత మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. నెల్లూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పీజీ సీట్ల విషయమై ఈనెల 20వ తేదీ ఢిల్లీ వెళ్ళినప్పుడు సంబంధిత శాఖ అధికారులతో సంప్రదిస్తామన్నారు.

### వైకాపాను గెలిపించుకోవాలి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, అన్ని రకాల సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అర్హులైన లబ్దిదారులకు సంతృప్తికర స్థాయిలో అందజేస్తోందని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఆయన నెల్లూరు రూరల్ పరిధిలోని 29వ డివిజన్‌లోని గాంధీనగర్‌లో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించి అక్కడి ప్రజలను కలిసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నెల్లూరు రూరల్ నియోజకవర్గం అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అవసరమైన నిధులన్నీ కేటాయిస్తున్నారని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్సీపికి ఘనవిజయం సాధించిపెట్టాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్ళీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు.



# కోటలో కొత్త కోర్టు కట్టండి

### హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి బార్ అసోసియేషన్ వినతి

మండల కేంద్రమైన కోటలో కోర్టు భవనం.. చాలా పాతదై పోయింది. దివంగత నేత, మాజీమంత్రి నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి హయాంలో ఆయన చొరవతో 1986 ఆగస్టు 3న కోటలో కోర్టు ఏర్పడింది. నియోజకవర్గ ప్రజలకు న్యాయస్థానం అందు బాటులో ఉండాలనే సదాశయంతో అప్పట్లోనే ఆయన కోటలో జూనియర్ సివిల్‌జడ్జి, జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటు చేయించారు. ఆ తర్వాత కోర్టుకు సొంత భవనాలను మంజూరు చేయించి 1990లో ప్రారంభింపజేశారు. అప్పటి హైకోర్టు చీఫ్‌జస్టిస్ ఆ భవనానికి ప్రారంభోత్సవం చేశారు. గత 35 సంవత్సరాలుగా ఈ కోర్టు నియోజకవర్గ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. అయితే, కాలక్రమంలో ఇది శిథిలావస్థకు చేరుకుంది. ఇప్పటికే ఈ భవనం వానకు ఉరుస్తోంది. శ్లాబులు, భవనం పైకప్పు అన్నీ బాగా దెబ్బతిన్నాయి. మెయిన్ కోర్టు హాలు అంతాకూడా పెచ్చులూడిపోతున్నాయి. ఈ నేప థ్యంలో కోట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.గోపాల్‌రెడ్డి తదితరులంతా కలిసి ఇటీవల నెల్లూరుకు వచ్చి జిల్లాకోర్టు నూతన భవనాలకు ప్రారంభోత్సవం చేసిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయిని కలిసి ఈ భవనం దుస్థితిని వివరించారు. రేపోమాపో కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న ఈ కోర్టు భవనం స్థానంలో వెంటనే కొత్త భవనాన్ని నిర్మించేందుకు కృషిచేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

### 'అనువాద మాధురి' పద్యకావ్యం..
# 'నాటా' సభలో ఆవిష్కరణ



అవధాని నరాల రామారెడ్డి అంటే తెలుగునేలపై తెలియని వారుండరు. అవధానం చేయడంలో, కవిత్వం చెప్పడంలో ఆయ నకు ఆయనే సాటి. నెల్లూరులో కూడా ఆయన పలు సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పద్యకవిగా కూడా సుప్రసిద్ధులైన ఆయన 'అనువాద మాధురి' అనే అద్భుతమైన పద్యకావ్యం రచిం చారు. ఆ కావ్యాన్ని ఇటీవల అమెరికాలో జరిగిన 'నాటా' సభల్లో ఆవిష్కరించడం విశేషం. ఆవిష్కరణ సభలో కవి నరాల రామా రెడ్డితో పాటు అమెరికాలో ప్రొఫెసర్‌గా ఉన్న పుదూరు జగదీశ్వరన్, తోటకూర ప్రసాద్, ప్రముఖ అష్టావధాని రామడుగు నరసింహా చార్య, నాటా సాహిత్యవేదిక కన్వీనర్ ఊరిమిండి నరసింహారెడ్డి, ప్రథమ మహిళా శతావధాన్ని ఆకెళ్ళ బాలభాను, ప్రముఖ రచయిత వంగూరి చిట్టెంరాజు తదితరులు పాల్గొన్నారు.

# భవ్యహాసినికి.. 'ఇండియా బుక్ రికార్డు'

### 4 గంటల నిర్విరామ నృత్యానికి అవార్డు





నెల్లూరు దర్గామిట్టలోని అవెన్యూస్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని, కళాదీప్తి డాన్స్ ఇన్‌స్టిట్యూట్‌లో శాస్త్రీయ నృత్యాన్ని అభ్యసిస్తున్న నల్లంగు భవ్యహాసిని ఇటీవల స్థానిక టౌన్‌హాల్‌లో నాలుగు గంటల పాటు నిర్విరామ భరతనాట్య ప్రదర్శనతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు ఆ చిన్నారి నాట్యప్రతిభకు మెచ్చి 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్' అవార్డును బహుకరించారు. నిబంధనల మేరకు, ప్రతి నలభై నిమిషాలకు కొద్దిసేపు స్వల్పవిరామం తీసుకునే అవ కాశం ఉన్నా, ఎలాంటి విరామం తీసుకోకుండానే నిర్విరామంగా నాలుగు గంటల పాటు నృత్యం చేయడం భవ్యహాసిని ప్రత్యేకత అని ఈ సందర్భంగా ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ న్యాయనిర్ణేత దుర్గా వెంకటేశ్వరరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో భవ్యహాసిని తల్లితండ్రులు నల్లంగు సునీల్‌కుమార్-చెంచులక్ష్మి, కళాదీప్తి సుబ్రహ్మణ్యం, స్కాలర్ స్కాలర్స్ స్కూల్ అధినేత పద్మజా రెడ్డి, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఇదే స్ఫూర్తితో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్ సాధించడం కోసం భవ్యహాసిని ఈనెల 23న తమిళనాడులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అరుణాచలంలో అనేక భక్తిగీతాలకు భరతనాట్యం చేస్తూనే 14 కిలోమీటర్ల గిరిప్రదక్షిణ చేయాలని కూడా సంకల్పించిందని భవ్యహాసిని తల్లితండ్రులు తెలిపారు. ఆ చిన్నారి లక్ష్యం నెరవేరాలని ఆశిద్దాం!..

# టెన్త్‌లో ప్రతిభచూపిన విద్యార్థులకు నగదు బహుమతులు

ఇటీవల పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన రాపూరు విద్యార్థులకు శ్రీకిరెడ్డి రాఘవరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఈనెల 10న నగదు బహుమతులు అందజేశారు. రాపూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన అవినాష్, చరణ్, చైతన్యలకు రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేలు వంతున ట్రస్ట్ ఛైర్మెన్ శశిధర్‌రెడ్డి ప్రోత్సాహక బహుమతులిచ్చారు. అదేవిధంగా, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన హన్సికాబేగం, శ్రీనిధిలకు రూ.10 వేలు, 5వేల రూపాయల వంతున బహుమతులు అందజేసి అభినందించి, విద్యార్థినీవిద్యార్థులు కష్టపడి చదివి తాము చదువుకున్న పాఠశాలలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దయాకర్‌రావు, డాక్టర్ లీలా కుమార్, ట్రస్ట్ ప్రతినిధులు వినోద్ కుమార్‌రెడ్డి, రాధ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో కాంగ్రెస్...

# లోక్‌సభకే పోటీ చేయాలి! అసెంబ్లీకి కాదు!!





ఔను! మీరు చదివింది కరెక్టే. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పార్లమెంట్ నియోజక వర్గాలు 25లోనే కాంగ్రెస్ పోటీ చేయాలి. ఏపీ అసెంబ్లీకి కాదు. ఇందుకు బలమైన కారణాలు లేకపోలేదు.

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్‌పార్టీ ఇప్పుడు అంపశయ్య మీద ఉన్న భీష్ముడిలా అచేతనంగా ఉండిపోయింది. కళ్ళు మాత్రం తెరుచుకుని చూస్తోంది. సహజసిద్ధంగా కదప గలిగిన తల, చెయ్యి, కాలును సైతం కదపలేని స్థితిలో అది ఉంది.

మంచో... చెడో... ఒక రాజకీయ నిర్ణయం తీసుకున్న రాజకీయపార్టీ, దాని ఫలితంగా ఇంతటి ప్రజాగ్రహానికి, అవమానానికి లోనైన సందర్భం దేశ చరిత్రలో మరొకటి లేదు.

వై.ఎస్.రాజశేఖరరెడ్డి బతికి ఉండగా, కాంగ్రెస్ ఢిల్లీ పెద్దలు రాష్ట్ర విభజన అనే ఆలోచన వైపు సైతం కన్నెత్తి చూడలేకపోయారు. ఆయన మరణానంతరం, విజృంభించిన ఆ ప్రయత్నాలను నిలువరించడానికి... వై.ఎస్ ఆత్మీయుడు కేవీపీ రామచంద్రరావు బలం సరిపోలేదు. ఉమ్మడి రాష్ట్ర కాంగ్రెస్‌కు ఆయన తెరవెనుక పనిచేసిన దర్శకుడే గానీ, తెర మీద కనపడిన నేత కాదు కదా!

ఆంధ్రలోని మిగిలిన కాంగ్రెస్ నాయకులను సోనియాగాంధీ బృందం పెద్దగా లెక్కలోకి తీసుకోలేదు. విభజనను నిలువరించడానికి ఆనాటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి విశ్వప్రయత్నం, వీరోచిత పోరాటం చేశారు గానీ, సోనియా దురాలోచనను నిలువరించలేకపోయారు.

ఏతా.... వాతా.... రాష్ట్రాన్ని విభజించి పారేశారు. బర్త్‌డే కేక్ కోసినట్టు కోసి పారేశారు. దాంతో, ఆంధ్రుల ఆగ్రహం ఆకాశాన్ని అంటింది.

విభజన నేపథ్యంలో జరిగిన 2014 ఎన్నికల్లో, 175కు గాను కాంగ్రెస్‌కు 174 అసెంబ్లీ స్థానాల్లో డిపాజిట్ రాలేదు. చీపురుపల్లి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన బొత్స సత్యనారాయణ ఒక్కరికే డిపాజిట్ దక్కింది. అలాగే, మొత్తం 25 లోక్‌సభ స్థానాలలోనూ డిపాజిట్‌లు రాలేదు. కాంగ్రెస్ ఊహించని పరిణామం ఇది. అనేక యుద్ధముల నారితేరిన కాంగ్రెస్ యోధులందరూ ఎన్నికల రణరంగంలో నేలకొరిగారు. ఆంధ్రులలో ఒక్కండు... ఒక్కండును కూడా వారి మొరాలకించ లేదు. క్షతగాత్ర కాంగ్రెసీయులు చెట్టుకొకరు... పుట్టకొకరు చెల్లా చెదురైపోయారు.

ఇప్పటికి పదేళ్లయింది. సునామి లాంటి నాటి ప్రజాగ్రహానికి... సర్వ శిథిలమై పోయిన గృహంలా మారిపోయిన కాంగ్రెస్‌పార్టీ ఇప్పటికీ కోలుకోలేదు.

మరో ఏడాదిలోగా ఎన్నికలు జరగవలసి ఉన్న తరుణంలో జగన్, చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్... ఎన్నికల వ్యూహ ప్రతివ్యూహాల్లో నిమగ్నమై జనంలో తిరుగుతున్నారు. అభ్యర్థుల వడబోత, ఎంపికల్లో మునిగిపోయారు.

కాంగ్రెస్‌లో మాత్రం చడీచప్పుడూ లేదు. అసెంబ్లీకి గానీ, లోకసభకు గానీ అభ్యర్థిత్వం కావాలని అడిగేవారు లేరు.

పీసీసీ అధ్యక్షుడుతో సహా... కాంగ్రెస్ ఆఫీసు బేరర్స్‌లో ఎవరూ పోటీచేసే పరిస్థితులు ఆంధ్రలో లేవు. దీనికితోడు ఆంధ్ర కాంగ్రెస్ వ్యవహారాల పరిశీలకుడిగా కేరళ మాజీ ముఖ్యమంత్రి ఊమెన్ చాందిని నియమించారు.

"గతి లేని పెళ్ళానికి.... మతి లేని మొగుడు" సామెతను గుర్తుకు తెచ్చే కాంబినేషన్ ఇది. ఆయనకు వినపడదు. కనపడుతుందేమో తెలియదు. రాజకీయంగా కెరీర్ దాదాపుగా అయిపోయింది. అందువల్ల, ఆయన చేయాల్సిన పనులు కాంగ్రెస్‌లో ఆయన ఇద్దరు కుమారులు చూస్తుంటారు.

స్థూలంగా ఇదీ ఆంధ్రలో కాంగ్రెస్‌పార్టీ పరిస్థితి. దీనికి గిడుగు రుద్రరాజు అధ్యక్షుడు. వ్యక్తిగతంగా సౌమ్యుడు. అజాతశత్రువు లాంటివారు. అందరికీ అనుకూలం (అంటే ఎవరికీ వ్యతిరేకం కాదు). గ్రూపుల్లేవు. కానీ, కాంగ్రెస్‌కు కాయకల్ప చికిత్స చేయడం ఎలా? 'కేరళ ఆయుర్వేద వైద్యం' వల్ల, కాంగ్రెస్‌కు కలిగిన లాభం ఏమీ కనబడడం లేదు.

ఇక్కడే, కాంగ్రెస్ పెద్ద తలకాయలు ఆలోచించాలి.

ఆంధ్ర కాంగ్రెస్‌కు సంబంధించినంత వరకు, 'పెద్ద తలకాయ' అంటే... కేవీపీ రామచంద్రరావే. ఆయన ముందు, మిగిలిన కాంగ్రెస్ తలకాయలన్నీ చిన్నవే. (ఉండవల్లి అరుణ్‌కుమార్ రూపంలో) ఇంకో తెలివైన తలకాయ ఉంది గానీ, "ఈ పార్టీల లంపటం వద్దు. ఫ్రీ బర్డ్ లాగా, సంసార జీవితానికి విడాకులిచ్చేసిన సొసైటీ లేడీ లాగా తిరిగేస్తాన్..." అంటోంది.

ఈ పరిస్థితుల్లో, ఆంధ్రలో కాంగ్రెస్‌పార్టీ పునరుజ్జీవనానికి ఒకే ఒక అవకాశం కనపడుతుందని కాంగ్రెస్ శ్రేయోభిలాషులు కొందరు అంటున్నారు.

రాష్ట్ర అసెంబ్లీకి పోటీచేసే తలనొప్పిని స్థానిక ప్రాంతీయపార్టీలకు వదిలేసి, 25 లోక్‌సభ స్థానాలకు మాత్రమే పోటీ చేయడమే కాంగ్రెస్ ముందున్న ప్రత్యామ్నాయమని కొందరు పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఇందుకు బలమైన కారణాలు కూడా లేక పోలేదు.

● రాష్ట్ర ఎన్నికల రాజకీయం అటు వైసీపీ, ఇటు టీడీపీ– జనసేన కూటమి మధ్య ఇప్పుడు చీలిపోయి ఉంది. ఏదో అద్భుతం... అనూహ్యం... జరిగితే తప్ప ముఖాముఖి పోటీలు జరిగే రాజకీయ పరిస్థితులే కనపడుతున్నాయి.

● జనం కూడా ఈ రెండు పక్షాల మధ్య చీలిపోయి ఉన్నారు. అయితే వైసీపీ కాకపోతే టీడీపీ – జనసేన కూటమి.

● కాంగ్రెస్ అనే పార్టీ ఒకటి ఉందనే విషయమే జనానికి గుర్తుండడంలేదు.

● ఫలితంగా కాంగ్రెస్‌కు పోటీచేసే అభ్యర్థులే దొరికే పరిస్థితి లేదు.

● రాష్ట్ర శాసనసభ ఎన్నికలు అటు వైసీపీకి – ఇటు టీడీపీకి "డూ ఆర్ డై..." అనే స్థాయిలో జరగబోతున్నాయి. రెండు పక్కలా సామ, దాన, భేద, దండోపాయాలు విశ్వరూపం ప్రదర్శించబోతున్నాయి.






ఓటర్లలో అధికులను... ఎక్కడికక్కడ – 'క్యాష్ & క్యారీ మెట్రో' అన్నట్టుగా రాజకీయాలు తయారు చేశాయి.

● రెండు మదపుటేనుగులు కలబడే దృశ్యాన్ని అసెంబ్లీ రాబోయే ఎన్నికలు గుర్తుకు తెస్తాయి.

● ఈ పోరాటం మధ్యలో కాంగ్రెస్‌కు, ప్రధాన పార్టీలు బలపరచని ఇతర చిల్లర మల్లర పార్టీలకు స్థానమే ఉండదు.

● అయితే వైసీపీ (జగన్) అయినా అధికారంలోకి వస్తుంది, కాకపోతే టీడీపీ – జనసేన కూటమి అయినా అధికారంలోకి వస్తుంది. రెండూ తెలుగు పార్టీలే. ఈ రెండింటిలో తమకు తగిన ఒక పార్టీని ఓటర్లు ఎన్నుకుంటారు. అది ఏది అనేది వారి పూర్వ జన్మ కర్మను బట్టి ఉంటుంది. బుద్ధిః కర్మానుసారిణీ... అన్నారు కదా పెద్దలు. In a democracy, people get the Government they deserve. కనుక ఎవరో ఒకరు.... గెలుస్తారు. పేచీలేదు.

కానీ, లోక్‌సభ ఎన్నికలు అలా కాదు. రాష్ట్రం నుంచి లోక్‌సభకు టీడీపీ గెలిచినా, వైసీపీ గెలిచినా, జనసేన గెలిచినా.... అవి గెలిచినట్టు కాదు. రాష్ట్రంతో సంబంధం లేని బీజేపీ గెలిచినట్టు. మొత్తం పాతిక స్థానాలు గెలిచినట్టే. ఒక్క సీట్‌లో సైతం సొంతంగా డిపాజిట్ దక్కించుకోగలిగిన బలం లేకపోయినప్పటికీ, రాష్ట్రంలోని మొత్తం 25 స్థానాలలో గెలిచినవారు... ఆ తరువాత రాజ్యసభకు ఈ మూడు పార్టీల నుంచి ఎన్నికైనవారు కూడా బీజేపీకే మద్దతు పలుకుతారు. ఈ విచిత్రం దేశం మొత్తం మీద ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే ఉంది. పోనీ, బీజేపీ ఏమైనా ఆంధ్రప్రదేశ్‌పై కనికరం చూపిస్తుందా అంటే.... అదీ లేదు. అంటే... ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయపార్టీల మద్దతుకు బీజేపీ ఏమాత్రం అర్హురాలు కాదు.

ఇక కాంగ్రెస్ విషయానికి వస్తే, జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌కు ప్రధాన రాజకీయ శత్రువు బీజేపీయే కానీ, రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలు కాదు.

● రాష్ట్రంలో వైసీపీ గెలిచినా... టీడీపీ గెలిచినా కాంగ్రెస్‌కి ఒకటే.

● కానీ, లోక్‌సభలో బీజేపీని వీలైనంత నిలువరించడమే కాంగ్రెస్ లక్ష్యంగా రాహుల్‌గాంధీ ప్రయత్నాలు చేస్తున్నారు.

● ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా, పోలవరం ప్రాజెక్టుకు జాతీయహోదా ఇస్తానని హామీ ఇచ్చింది కాంగ్రెస్‌పార్టీయే కానీ, బీజేపీ కాదు. అందుకే బీజేపీ ఆ హామీలను పక్కన పెట్టింది.

● రాష్ట్రానికి ఒక రాజధాని అనేది లేదు.

● విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్ పరం చేయడానికి బీజేపీ కంకణం కట్టుకుంది.

● పోలవరం ప్రాజెక్ట్ హుష్ కాకి అయిపోయింది. బీజేపీకి పట్టలేదు.

● అయినప్పటికీ, రాష్ట్రంలోని ప్రాంతీయపార్టీలు బీజేపీని ప్రశ్నించగల స్థితిలో లేవు. దేని కారణాలు దానికి ఉన్నాయి.

అందుకే, శాసనసభ ఎన్నికల్లో తమ అస్త్ర, శస్త్ర, వాగ్బాణ ప్రావీణ్య బల ప్రదర్శనను ప్రాంతీయపార్టీలకు వదిలేసి, కేవలం లోక్‌సభకు మాత్రమే కాంగ్రెస్ పోటీ చేయాలి.

● రాష్ట్రంలోని ప్రాంతీయపార్టీలు బీజేపీని నిలదీయలేని స్థితిలో ఉన్నాయని, వాటికి లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ వేస్తే, బీజేపీకి వేసినట్టేనన్న విషయాన్ని కాంగ్రెస్ 'సింగల్ పాయింట్ ఎజెండా'గా ఓటర్ల దృష్టికి విస్తృతంగా తీసుకువెళ్ళాలి.

కేంద్రంలో బీజేపీ గెలిస్తే, ఏపీకి మరో అయిదేళ్లు ఏ హామీలు అమలుకావనే విషయాన్ని కాంగ్రెస్ ప్రజల్లోకి తీసుకెళ్ళాలి. అంటే ప్రత్యేకహోదా రాదు, పోలవరం అనుకున్న రీతిలో పూర్తి కాదు, విశాఖ ఉక్కు... గుజరాత్ హక్కు అయిపోతుంది.... అమరావతి కూడా.... శివార్పణం!

కాంగ్రెస్‌ను గెలిపిస్తే, కేంద్రంలోకి రాగానే గతంలో ఏపీకి ఇచ్చిన హామీలు అమలు చేస్తామని రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ వాద్రా హామీ ఇవ్వాలి.

లోక్‌సభ ఎన్నికలు.... అసెంబ్లీ ఎన్నికలు వేరు వేరని, లోక్‌సభ ఎన్నికల్లో మన ప్రాంతీయపార్టీలు గెలిచినా రాష్ట్రానికి ప్రత్యేకహోదా సాధించలేవు అని కాంగ్రెస్ ప్రజల దృష్టికి బలంగా తీసుకువెళ్ళాలి. వాటికి వేసే ప్రతి ఓటూ బీజేపీకి వేసినట్టేనన్న విషయాన్ని ఓటర్లకు బలంగా కాంగ్రెస్ చెప్పగలగాలి. కాంగ్రెస్‌కు వేసే ప్రతి ఓటూ కాంగ్రెస్‌కే తప్ప, మరో పార్టీకి కాదు అనే విషయంలో ఓటర్‌కు స్పష్టత ఉండాలి. ఈ విషయంలో కర్ణాటకలో జరిగినంత ఉధృతంగా ప్రచారం జరిగితే, ప్రజలు ఆలోచిస్తారు.

"అసెంబ్లీకి మీ ఇష్టం – పార్లమెంట్‌కు మాత్రం కాంగ్రెస్ మాత్రమే" నినాదంతో కాంగ్రెస్ ప్రజల్లోకి వెళితే, దాని హస్తరేఖలు మారడం తథ్యం.

దీనివల్ల మరో రాజకీయ ప్రయోజనం కూడా ఉంది. రాష్ట్రంలోని ఏ ప్రాంతీయ పార్టీకి ఎంపీ ఓటు వేసినా... అది బీజేపీకే వెళుతుంది అనే స్పృహతో ఎంతమంది ఓటర్లు ఉన్నారు అనేది కూడా తెలుస్తుంది. ఓటర్లలో బీజేపీపై మరింత స్పష్టత వస్తుంది.

ఈ బాధ్యత చేపట్టగలిగిన స్థాయి, అనుభవం కలిగిన వ్యూహకర్త / సర్వ కాంగ్రెస్ జనామోద నేత కేవీపీ రామచంద్రరావు మాత్రమే.

పోటీ చేయాల్సింది 25 లోక్‌సభ స్థానాలే గనుక, ప్రస్తుతం నిద్రాణావస్థలో ఉన్న కాంగ్రెస్ అతిరథ మహారథుల్లో ఎవరెవరిని ఎక్కడ పోటీ చేయించాలో ఆయనకు తెలుసు. కేవీపీ గుమ్మం తొక్కని కాంగ్రెస్‌నేత అంటూ తెలుగు రాష్ట్రాల్లో ఎవరూ లేరు కదా!

అందుకే, అన్ని విషయాల్లోనూ ఆయన లీడ్, చొరవ తీసుకుని కాంగ్రెస్‌కు పునః ప్రాణప్రతిష్ఠ చేయాలి. ఈ ఆలోచన మినహా కాంగ్రెస్‌కు ఏపీలో మరో ప్రత్యామ్నాయం లేదు. అలాగే కేవీపీ రామచంద్రరావు మినహా, ఏపీ కాంగ్రెస్‌ను బతికించడానికి మరో నాయకుడు లేరు.

**- భోగాది వేంకట రాయుడు**
medhomadhanam@gmail.com




# చందమామా.. మేం వచ్చేస్తున్నాం!

## నింగిలోకి చంద్రయాన్-3 రాకెట్ సిద్ధం

## ముహూర్తం జులై 14 మధ్యాహ్నం 2.35 గంటలకు

*భారత అంతరిక్ష ప్రయోగాల్లో మరో అద్భుత ఘట్టం రూపుదాల్చనుంది. జాబిల్లిపైకి ఎవరూ వెళ్ళని దారుల్లో వెళ్ళి చందమామ దక్షిణ ధ్రువంపై అడుగిడి ప్రపంచాన్ని ఆశ్చర్యచకితుల్ని చేయడానికి, తద్వారా ప్రపంచదేశాలకు మరోసారి భారత్ తన ప్రతిభాపాటవాలను చాటిచెప్పేందుకు ఇస్రో అత్యంత ప్రతిష్టాత్మకమైన చంద్రయాన్ యాత్రకు సిద్ధమైంది. ఎప్పుడెప్పుడా అని దేశప్రజలే కాక, మానవాళి అంతా ఎదురుచూస్తున్న చంద్రయాన్ రాకెట్ నింగిలోకి దూసుకుపోయేందుకు సిద్ధంగా ఉంది. జులై 14న రాకెట్ ప్రయోగానికి ముహూర్తం నిశ్చయమైంది. 24 గంటల కౌంట్‌డౌన్ కూడా బుధవారం ప్రారంభమైంది. కౌంట్‌డౌన్ పూర్తికాగానే రాకెట్ ప్రయోగం జరుగుతుంది. అన్నీ అనుకూలిస్తే శుక్రవారం మధ్యాహ్నం సరిగ్గా 2.35 గంటలకు శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రంలోని రెండవ ల్యాంచ్‌ప్యాడ్ నుంచి చంద్రయాన్ రాకెట్ నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి దూసుకువెళ్తుంది. ఈ ప్రయోగానికి ఇస్రో ఛైర్మెన్ సోమనాథ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లన్నీ చకచకా జరిగాయి. చంద్రయాన్-3 దిగ్విజయం కావాలని అందరూ కోరుకుంటున్నారు.*

చంద్రుడి కక్ష్యలోకి చంద్రయాన్-3ను మోసుకెళ్ళేందుకు ఇస్రో 'బాహుబలి రాకెట్'గా పేరెన్నికగన్న అత్యంత శక్తివంతమైన, 640 టన్నుల బరువున్న 'ఎల్‌వీఎం-3-ఎం-4' రాకెట్‌ను 'చంద్రయాన్' కోసం ఇస్రో శాస్త్రవేత్తలు సిద్ధం చేశారు. షార్‌లో ఈ రాకెట్‌ను ప్రయోగవేదిక వద్దకు తరలించేందుకు ఇటీవల షార్ డైరెక్టర్ రాజరాజన్ పచ్చజెండా ఊపారు.

## 3 లక్షలా 84వేల కిలోమీటర్ల ప్రయాణం

ఇస్రో అమ్ములపొది నుంచి రామబాణంలా దూసుకువెళ్ళే ఎల్‌వి ఎం-3, ఎం-4 రాకెట్ జాబిల్లి వైపు తన గమనాన్ని ప్రారంభించి దాదాపు 3,84,000 కిలోమీటర్లు ప్రయాణించి చంద్రుని దక్షిణ ధ్రువానికి చేరాల్సి ఉంటుంది. అందుకు 48 రోజులు పడుతుంది. చంద్రుని కక్ష్యలోకి చేరాక ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్ నుంచి విడిపోయాక చంద్రయాన్-3 వ్యోమనౌకను భూకక్ష్య నుంచి చంద్రుని కక్ష్య వరకు తీసుకువెళ్ళే ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి విక్రమ్ ల్యాండర్ విడిపోయి చంద్రుడి ఉపరితలంపై అడుగుపెడుతుంది. ఆ తర్వాత వెంటనే ఆ ల్యాండర్ నుంచి ప్రగ్యాన్ రోవర్ బయటకువచ్చి చందమామపై కలియ దిరుగుతూ 14 రోజుల పాటు పరిశోధనలు చేస్తుంది. చంద్రమండలంపై ఎలాంటి వాతావరణం ఉంది, అక్కడ పరిస్థితులెలా ఉన్నాయనేది అన్వేషించడమే చంద్రయాన్ లక్ష్యం. చంద్రమండలానికి సంబంధించి అనేక రహస్యాలు ఈ పరిశోధనల ద్వారా కనుగొనేందుకే ఈ ప్రయోగం ఎంతగానో తోడ్పడుతుంది. ఈ పరిశోధనలన్నీ విజయవంతమైతే చంద్రునితో పాటు ఇతర గ్రహాల ఆనుపానులు కూడా తెలియడమే కాక, చంద్రునిపై అడుగిడాలన్న మానవాళి కల సాకారం కావడానికి కూడా మార్గం సుగమమవుతుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అంతరిక్ష యాత్రలో ఇంత క్లిష్టమైన, సాహసోపేత యాత్రను చేపట్టడం భారత శాస్త్రవేత్తల అపార ప్రజ్ఞాపాటవాలకు నిదర్శనం. అంతేకాదు, భవిష్యత్తులో మానవ సహిత చంద్రయాన్ ప్రయోగం చేయాలని కూడా ఇస్రో ఆలోచన చేస్తుండడం మరో విశేషం.

## చంద్రయానంలో 'దక్షిణ'యానం

గతంలో అమెరికా, రష్యా, చైనాలు మాత్రమే చంద్రునిపైకి వెళ్ళి జెండాలు నాటివచ్చాయి. అమెరికా మానవసహిత ప్రయోగం కూడా చేసింది. అయితే, ఇప్పుడు ఇస్రో చేస్తున్న ప్రయోగంలో చంద్రునిపై దక్షిణ ధ్రువంపై కాలుమోపడం ఎంతో ప్రత్యేకం. ఇక్కడ చీకటి బిలాలుంటాయి. వీటిలో అతిశీతలమైన నీరు గడ్డకట్టి ఉండే అవకాశం ఉందని, అందువల్ల జీవజాలం మనుగడకు ఏమైనా అవకాశం ఉంటుందో లేదో పరిశోధించాల్సి ఉందని శాస్త్రవేత్తల భావన. వెన్నెల లోకంలో విహరించడానికి, అక్కడ నివసించడానికి అవకాశాలు ఉన్నాయో లేదో ఈ పరిశోధనల్లో తెలుస్తుంది. అందుకే, ఇది గతంలో ఇతర దేశాలు పంపిన రాకెట్‌ల కంటే విశిష్టమైనది. మన రాకెట్ చంద్రునిపై కొత్తప్రాంతాల్లో దిగడానికి, చంద్రయానంలో దక్షిణయానం చేయడానికి పయనమవుతుండడం విశేషం. ఇంత ప్రతిష్టాత్మకమైన చంద్రయాన్ ప్రయోగం కోసం ఇస్రో శాస్త్రవేత్తలు రేయింబవళ్ళు అలుపెరుగని కృషి చేస్తున్నారు. చంద్రునిపై పరిశోధనలకు 2008 అక్టోబర్ 24న ఇస్రో చంద్రయాన్ ప్రయోగాన్ని చేపట్టి చంద్రమండలంపై నీటి జాడలను గుర్తించడం అది అపూర్వం. చంద్రునిపై నీరుందనే విషయం కనుగొనింది తొలిసారిగా మన శాస్త్రవేత్తలే. కానీ పూర్తి స్థాయిలో ఆ పరిశోధనలు జరగలేదు. ఆ తర్వాత చంద్రునిపై మరిన్ని పరిశోధనలకు 2019 జులై 22న జీఎస్‌ఎల్‌వి మార్క్-3 రాకెట్ ప్రయోగాన్ని చేపట్టడం, చంద్రుని కక్ష్యలోకి ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. అయితే చంద్రుని ఉపరితలం మీదికి దిగడానికి మరో రెండు కిలోమీటర్ల ఎత్తులో ల్యాండర్ ఉన్న సమయంలో సాంకేతిక కారణాలతో అది ఒరిగిపోయి శాస్త్రవేత్తలకు తీవ్రనిరాశను కలిగించింది.

ఈ నేపథ్యంలో, చంద్రయాన్-2లో తలెత్తిన లోపాలను సరిదిద్దుకుని... జాబిల్లిపై పరిశోధనలకు ఇప్పుడు మరోసారి ఇస్రో సన్నద్ధమైంది. ఈ రాకెట్ ప్రయోగానికి లాంచ్ రిహార్సల్స్ కూడా జరిగాయి. ఈ పరిశోధనల కోసం 615 కోట్ల రూపాయలను కేంద్రప్రభుత్వం కేటాయించింది. ఈసారి ప్రయోగం పూర్తిస్థాయిలో విజయవంతం కావాలనే గట్టి సంకల్పంతో శాస్త్రవేత్తలు ఇస్రో ఛైర్మెన్ సోమనాథ్ సారథ్యంలో ఎంతో పట్టుదలగా, నిర్విరామంగా శ్రమిస్తున్నారు. అన్ని పరిస్థితులు అనుకూలిస్తే ఆగస్టు 23వ తేదీన లేకుంటే 24న చంద్రయాన్-3 రోవర్ జాబిల్లిపై అడుగు పెడుతుందని ఇస్రో శాస్త్రవేత్తలు ఆకాంక్షిస్తున్నారు. ఏదేమైనా, ఈసారి చంద్రయాన్ పూర్తిస్థాయిలో విజయవంతమవుతుందని శాస్త్రవేత్తలే కాక దేశప్రజలందరూ ధీమాగా ఉన్నారు. ప్రపంచమంతా ఈ ప్రయోగంపై దృష్టి సారించి ఉంది. మన భారత శాస్త్రవేత్తల శ్రమ తప్పకుండా ఫలిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. చంద్రయాన్ నూటికి నూరుశాతం దిగ్విజయమవుతుందని ఆశిద్దాం!..ఆల్ ది బెస్ట్!


## బహిరంగ ప్రకటన

మా క్లయింటు డాక్టర్ జీ.వీ.కృష్ణారెడ్డి, వ్యవస్థాపకులు జీవీకే గ్రూప్ ఆఫ్ కంపెనీస్, హైదరాబాదు మరియు అధ్యక్షులు శ్రీ కస్తూరిదేవి విద్యాలయ కమిటీ, నెల్లూరు వారి ఆదేశాల మేరకు సాధారణ ప్రజానీకం సమాచారం కోసం ఈ బహిరంగ ప్రకటన ఇవ్వడమైనది.

కొంతమంది తమ సామాజిక మాధ్యమాల ద్వారా, యు ట్యూబ్ ఛానళ్ల ద్వారా, వెబ్‌మాగజైన్లు, పోర్టల్స్ ద్వారాను, మరీ ముఖ్యంగా నెల్లూరు నుండి వెలువడుతున్న జమీన్‌రైతు పత్రిక ప్రింటర్, ఎడిటర్ మరియు పబ్లిషర్, నా క్లయింటు పరువు మర్యాదలకి భంగం కలిగే విధంగా, ఆయన ప్రతిష్ట దిగజారేలా తమ పత్రికలో అబద్ధాలను, అసత్యాలను, తప్పుడు వార్తలను ప్రచురిస్తూ ఆయనకి పరువు నష్టం కలిగిస్తున్నాడు.

జమీన్‌రైతు వారపత్రిక, దాని నిర్వాహకుల చర్యలను ఖండిస్తూ నా క్లయింటు హైదరాబాదులోని గౌరవ XIవ అడిషనల్ చీఫ్ జడ్జి కోర్టు, సిటీ సివిల్ న్యాయస్థానం నందు O.S 326 ఆఫ్ 2023 ప్రకారం టెంపరరీ ఇంజక్షన్ కొరకు అభ్యర్థించడం జరిగింది.

గౌరవ న్యాయస్థానం మా క్లయింటు అభ్యర్ధనను మన్నించి I.A 1539 ప్రకారం సదరు పత్రిక, ఆ పత్రిక నిర్వాహకుల రాతలను నియంత్రిస్తూ దిగువ కనపరచిన విధంగా తాత్కాలిక ఇంజక్షన్ ద్వారా ఆదేశాలు ఇవ్వడం జరిగింది.

**"జమీన్‌రైతు పత్రికను, సదరు పత్రిక నిర్వాహకులను తాత్కాలిక ఇంజక్షన్ ద్వారా కట్టడి చేయాలని ఈ కోర్టు భావిస్తుంది. కాబట్టి, పిటిషన్‌దారునికి అనుకూలంగా ఎక్స్‌పార్టీ తాత్కాలిక ఇంజక్షన్ మంజూరు చేస్తూ, పిటిషన్‌దారుని పరువు మర్యాదలకి, పేరు ప్రతిష్టలకు భంగం కలిగించే ఎలాంటి వార్తలు, వ్యాఖ్యలు, ప్రకటనలు, కథనాలు ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియాల లోనూ, సామాజిక మాధ్యమాలలోను, ఏ ఇతర సాధనాలలోనూ అక్షర రూపంలో, ఫోటోల రూపంలో, వీడియోల రూపంలో, క్యారికేచర్ రూపంలో ప్రచురించకూడదని ఆదేశించడమైనది. ఇతరులెవ్వరూ కూడా పిటిషినర్‌కి సంబంధించిన ఏ సమాచారాన్ని ఎలాంటి మాధ్యమాల ద్వారా కూడా వేరొకరికి చేరవేయకూడదు."**

దుర్బుద్ధితో, ప్రజలను తప్పుత్రోవ పట్టించే విధంగా మా క్లయింటుపై వచ్చిన యోగ్యతలేని నిరాధార వార్తలను నమ్మవద్దని సాధారణ ప్రజలకి విజ్ఞప్తి చేయడమైనది.

**M/S అవధాని అండ్ అసోసియేట్స్**
**కే.విజయభాస్కరరెడ్డి**
**వి.సౌభాగ్యవల్లి**
అడ్వొకేట్స్
102 (G2), 2వ అంతస్తు, రెలియన్స్ కృష్ణ అపార్ట్‌మెంట్స్,
హిల్‌ఫోర్ట్ రోడ్, ఆదర్శనగర్, హైదరాబాదు - 500004. ఫోన్ : 8074268036
management@avadhaniassociates.com


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com